VISALAANDHRA VIJAYAWADA Phone No 376

రిజిష్టర్డు నెం. 6097. 4 పేజీలు : ఒక అణా

అబద్ధ వార్తలను ఖండిస్తూ ఫజ్లుల్ హక్ ప్రకటన

కలకత్తా, జూన్ 23

తూర్పు బెంగాల్ పరిస్థితులపై సంజాయిషీ చెప్పుకునేందుకు, రాబోయే పాకిస్తాన్ శాసనసభకు తాను హాజరౌతాడనీ, యునైటెడ్ ఫ్రంట్‌కు రాజీనామా యిస్తాడనీ బయలుదేరిన పుకారులను తూర్పు బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, ఫజ్లుల్ హక్ ఈవేళ ఖండించాడు. ఆ వార్తలన్నీ సత్యదూరాలనీ, దురుద్దేశంతో చేయబడే ప్రచారాలు మాత్రమేననీ హక్ అన్నాడు.

విశాలాంధ్ర

70593

సంపుటి 3 ★ విజయవాడ: గురువారం; జూన్ 24; 1954 ★ సంచిక 79

మహా భయంకర గూండా!

లాహోరు, జూన్ 23

పాకిస్తాన్ ప్రభుత్వం లాయల్పూరు జిల్లాకు చెందిన ఒక మహిళను "మహా భయంకర గూండా"గా ప్రకటించి పంజాబు గూండా చట్టంక్రింద పదివేల రూపాయల ధరావత్తు కోరింది. పాకిస్తాన్‌లో మహా భయంకర గూండాగా ప్రకటించబడ్డ స్త్రీలలో ఈమె రెండవది.

చైనాప్రధానికి నెహ్రూ ఆహ్వానం : ఇండొనేషియామంత్రి హర్షం

చైనా-భారతప్రధానుల సమావేశంవల్ల సత్ఫలితాలు కలుగగలవని ఆశాభావం

ఆసియాదేశాలు ఒకదానికొకటి సన్నిహితం కావలసిన ఆవశ్యకత ఉన్నదని స్పష్టీకరణ

కలకత్తా, జూన్ 22

ఆగ్నేయాసియా సమస్యలను చర్చించేందుకు ఢిల్లీకి చైనా ప్రధాన మంత్రిని నెహ్రూ ఆహ్వానించడంపట్ల ఇండొనేషియా విదేశాంగమంత్రి డాక్టరు సునార్జో హర్షాన్ని వెలిబుచ్చాడు.

హేగ్ వెడుతున్న డాక్టర్ సునార్జో నేటిరాత్రి డమ్‌డమ్ విమానాశ్రయంలో పత్రికా ప్రతినిధులతో ముచ్చటించుతూ ఇంకా యిలా అన్నారు:

"నెహ్రూ నేడు తీసుకొన్న ఈ చర్య నిజానికి చాలఉపయోగకరమైనది."

హాలెండ్‌తో ఇండొనేషియా యూనియన్‌కుగల సంబంధాన్ని తెగతెంపులు చేసుకోడానికీ, పశ్చిమ ఇరియన్ (డచ్ గినీ) పై సర్వస్వతంత్ర హక్కును ఇండొనేషియాకు మార్పు చేయాలని కోరడానికి హేగ్ వెడుతున్న ఇండొనేషియా ప్రతినిధివర్గానికి డాక్టర్ సునార్జో నాయకత్వం వహించుతున్నాడు.

ఆసియా దేశాల ఐక్యతను దృఢపరచి, వాటిని సన్నిహితం చేయవలసిన ఆవశ్యకతను డాక్టర్ సునార్జో నొక్కి వక్కాణించాడు. తన దేశంలో ఇంకా వున్న సామ్రాజ్యవాద అవశేషాలను ఆయన తీవ్రంగా ఖండిస్తూ నెదర్లాండ్స్‌తో తన దేశానికి ఉన్న సంబంధాన్ని తెగతెంపులు చేసుకొని, దేశానికి సర్వస్వతంత్రం చేసుకోడానికే తాను హేగ్ వెడుతున్నానన్నాడు. నెదర్లాండ్స్‌తోగల సంబంధం ఇండొనేషియా అభివృద్ధికి అటంకంగా ఉన్నదని ఆయన స్పష్టంచేశాడు.

ఆగ్నేయాసియా సైనిక కూటమిపై అభిప్రాయం చెప్పవలసిందిగా విలేఖరులు కోరగా ఆ సమస్యపై ఇండియా అభిప్రాయంతో ఇండొనేషియా ఏకీభవిస్తుందని డాక్టర్ సునార్జో అన్నారు.

ఆగ్నేయాసియా రక్షణ వ్యవస్థకు బ్రిటన్ సంసిద్ధత

వాషింగ్టన్, జూన్ 22

"ఆగ్నేయాసియా కొరకు రక్షణ కూటమి అవసరమని బ్రిటన్ ఆలోచిస్తూంది" అంటూ నేడు బ్రిటిషు రాయబారి సర్ రోజర్ మాకిన్స్ టెలివిజన్ ఇంటర్వ్యూలో ప్రసంగించాడు. ఆయనింకా ఇల్లా అన్నాడు:

"ఆగ్నేయాసియాలో రక్షణ వ్యవస్థ నిర్మాణం బ్రిటన్‌కు అవసరం. అటువంటి దానిని ఏర్పరిచేటందుకు ఎంతో కాలంగా ప్రయత్నిస్తున్నాం.

"బ్రిటన్, అమెరికాలమధ్య ఘర్షణ వార్తలబద్ధం. అతిశయోక్తులూను."

ఈజిప్టులో తిరుగుబాటు దారులకు శిక్షలు

కైరో, జూన్ 22

ఈజిప్టు ప్రధాని కర్నల్ గమాల్ అబ్దుల్ నాస్సర్ ప్రభుత్వాన్ని కూలద్రోయాలని ఏప్రిల్ 28 వ తేదీన ప్రయత్నించిన పదముగ్గురు సైనికాధికారులకు ఈవేళ శిక్షలు విధించబడ్డాయి.

నేరస్థులనుకున్న 16 గురిలోనూ ముగ్గురు విడుదల చేయబడ్డారు. ఈ తిరుగుబాటుకు నాయకత్వం వహించిన కాప్టన్ అహ్మదాలీ హుసేన్‌కు 15 సంవత్సరాల జైలుశిక్ష వేశారు. మిగతా వారికి వారి వారి పాత్రలనుబట్టి హెచ్చుతగ్గులుగా శిక్షలు విధింపబడ్డాయి.

చైనా ప్రధానిని తీసుకొని వచ్చే ప్రత్యేకవిమానం జెనీవా ఆగమనం

జెనీవా, జూన్ 22

చైనా ప్రధాని శ్రీ చౌ-ఎన్-లైను ఢిల్లీకి తీసుకొని వెళ్ళడానికి నాలుగు ఇంజనులుగల ఎయిర్ ఇండియావారి ప్రత్యేక విమానం బొంబాయినుండి ఇక్కడకు వచ్చింది. ఆ విమానంమీద ఢిల్లీలోని చైనారాయబారకార్యాలయంలోని కౌన్సలర్ షెన్ చీన్ వచ్చారు.

ఆయనకు ఇక్కడ భారత ప్రభుత్వ కౌన్సలర్ శ్రీ యస్. సెన్ స్వాగతమిచ్చారు.

దుగ్గిరాల ఎన్నిక ఫలితాలు

1282 ఓట్ల మెజారిటీతో కాంగ్రెసు అభ్యర్థి గెలుపు

విజయవాడ, జూన్ 22

దుగ్గిరాల ఉప ఎన్నికలో కాంగ్రెసు అభ్యర్థి శ్రీ మేదూరు నాగేశ్వరరావు గారు గెలుపొందారు. కాంగ్రెసుపార్టీ అభ్యర్థికి 21,926 వోట్లు రాగా కమ్యూనిస్టు అభ్యర్థి శ్రీ లావు బాల గంగాధరరావుగారికి 20,644 వోట్లు వచ్చాయి.

కృషికార్ లోక్‌పార్టీ అభ్యర్థి శ్రీ ఎ. వెంకటేశ్వర్లుగారికి 5,725 వోట్లు వచ్చాయి. ఆయన ధరావతును కోల్పోయారు.

ఈ ఉప ఎన్నిక కాంగ్రెసు శాసన సభ్యుడు శ్రీ ఆవుల రామిరెడ్డిగారిమరణం ఫలితంగా జరిగినవిషయము పాఠకులకు విదితమే.

[దుగ్గిరాల ఉప ఎన్నిక ఫలితాలను కొన్ని సంచికలలో నిన్ననే యిచ్చాం. సం॥]

దుగ్గిరాలలో కాంగ్రెసు గెలుపుకు కారణాలేమిటి?

ధరావతు కోల్పోయిన లోక్‌పార్టీ పరోక్షంగా కాంగ్రెసుకు తోడ్పడ్డ వైనం

అభివృద్ధి నిరోధక భూస్వాములకు ఇంకా ప్రజలపై గల పెత్తనం

[విశాలాంధ్ర ప్రత్యేక రాజకీయ విలేఖరి]

విజయవాడ, జూన్ 23

దుగ్గిరాల ఉపఎన్నికల్లో కాంగ్రెసు తన స్థానాన్ని నిలబెట్టుకున్నది. తెనాలి తాలూకా యింతవరకెప్పుడూ ప్రధానంగా కాంగ్రెసుకు బలీయమైన కేంద్రంగానే వుంటూవచ్చింది. ఆ దృష్ట్యా చూస్తే యీ యెన్నికల ఫలితం సహజంగా కనపడవచ్చు.

కాని ఆంధ్ర దేశంలో నేడున్న రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ఈ నిర్ణయం ఆశాభంగం కలిగించక తప్పదు. ఆంధ్ర దేశంలో యిదివరకెన్నడూ లేనంతగా నేడు కాంగ్రెసు నాయకత్వమూ, ఆంధ్ర ప్రభుత్వమూ అప్రతిష్ట పాలైయున్నాయి. కాంగ్రెసు అభ్యర్థి మాజీ యం. యల్. ఏ. గా వుండి, ఆ పదవిని దుర్వినియోగంచేసి స్వార్థపరత్వానికి ప్రాకులాడడమే నేడు జగద్విదితం.

కమ్యూనిస్టుపార్టీ నాయకులూ సభ్యులూ సునిశితమైన రాజకీయ విమర్శతో కాంగ్రెసు నాయకత్వాన్ని బోనులో ఎక్కించారు. రాష్ట్రం, రాజధాని, హైకోర్టు, మద్యపాన నిషేధం, పన్నులూ, విశ్వవిద్యాలయం జిల్లాబోర్డులు, ప్రాజెక్టులు మొదలైన రాష్ట్రవిషయాలలో కాంగ్రెసు నాయకత్వపు విద్రోహవిధానాన్ని విశదం చేశారు. భూస్వామ్యవిధానాన్ని రద్దు చేయకపోవటాన్ని, ప్రజల్ని గుత్తపెట్టుబడిదారుల దోపిడీకి యింకా గురిచేయటాన్ని ఖండించారు.

ఇందులో ఏ ఒక్క విషయానికీ కాంగ్రెసు నాయకత్వం సంజాయిషీ యిచ్చుకొని సమర్థించుకోలేకపోయింది. కాంగ్రెసు, కృషికార్ లోక్, ప్రజాసోషలిస్టు పార్టీల ప్రచారకులంతా, సంజీవరెడ్డి, రంగాగార్లు మొదలైన వారందరిదీ ఒకే పాట. ఒకే గోకటిపాట, కమ్యూనిస్టుపార్టీపై బూతులూ, నిందలూ వేయటమే వారి ప్రచార సారాంశం. ఉపముఖ్య మంత్రిగానూ, అఖిల భారత కాంగ్రెసు కార్యవర్గ సభ్యుడుగానూ ఉన్నత స్థానంలో నున్న శ్రీ సంజీవరెడ్డి "రష్యానుంచి కమ్యూనిస్టులకు మనియార్డర్లు వస్తున్నా"యనీ, "అవునూ అయిదెకరాల భూమి నేగాక అందమైన స్త్రీలనుగూడా యిస్తామంటా"రనీ నీచమైన ప్రచారం చేస్తే యిక ఆ ప్రచారస్థాయి ఎంత నీచంగావున్నదో తెలుసుకోవచ్చు. ఈ పరిస్థితుల్లో అప్రతిష్టపాలైన పార్టీ, అటువంటివాడే అయిన అభ్యర్థితో, ప్రజాపక్షంమీద అపనిందల్ని మాత్రమే ప్రచారంచేసి [illegible] మెజారిటీతో అయినా సీటును ఎలా గెలుచుకోగలిగిందీ అనేదే సమస్య.

నిందా ప్రచారంద్వారా కాంగ్రెసు ఓట్లు సంపాదించుకోగలిగిందనుకోవటం భ్రమ. అభివృద్ధి నిరోధకులూ భూస్వాములూ దుగ్గిరాల నియోజకవర్గప్రజలపై ఇంకావున్న పట్టు ఎంతో యీ ఎన్నికలు రుజువు చేస్తున్నాయి. శాసనసభా కార్యక్రమంలోనూ రాజకీయ రంగంలోనూ కమ్యూనిస్టుపార్టీ ఎంత ప్రశంసనీయంగా ప్రవర్తించి విజయాలు సాధించినా, కాంగ్రెసు ఎంత తప్పుడు పద్ధతుల్ని అనుసరించినా, అభివృద్ధి నిరోధకులు తమ పలుకుబడిని కమ్యూనిస్టుపార్టీకి వ్యతిరేకంగానే ప్రయోగిస్తారని విదితమౌతుంది.

అభివృద్ధి నిరోధకులు తమ పలుకుబడిని నిలుపుకునేందుకు కులతత్వాన్ని ఒక ఆయుధంగా వుపయోగించారు. కాంగ్రెసు అభ్యర్థిని, కాపు అభ్యర్థిఅని కులతత్వాన్ని రెచ్చగొట్టటానికి కొన్ని గ్రామాల్లో తీవ్ర ప్రయత్నాలు జరిగాయి. అయినా కమ్యూనిస్టుపార్టీ ఆ ప్రయత్నాలన్నింటినీ దాదాపుగా భగ్నంచేయగలిగింది. కాపు కేంద్రాలనుకున్న కొలకలూరులో కమ్యూనిస్టు పార్టీదే పైచేయి. నందివెలుగులో ఆరువందలకు మించిన మెజారిటీ కమ్యూనిస్టుపార్టీ సంపాదించింది. ఈ గ్రామాలలో భూస్వాముల ప్రాబల్యం అంతగా లేనందున కులతత్వ ప్రచారాన్ని పటాపంచలు చేయడం సాధ్యపడ్డది.

పెద్ద ఓటింగు బలంగల కొల్లిపర, తూములూరు, కల్లభాపురం, మున్నంగి గ్రామాల్లో మాత్రం కమ్యూనిస్టుపార్టీ యిలా జయప్రదం కాలేకపోయింది. ఒక గ్రామాన్ని మినహాయిస్తే లోగడ అక్కడ కమ్యూనిస్టు ఉద్యమం ప్రవేశించలేదు. భూస్వాముల పెత్తనం జోరుగా సాగిపోతోంది. శ్రీ సంజీవరెడ్డి, గోపాలరెడ్డి, శ్రీమతి రామసుబ్బమ్మ ప్రభృతులు యీ సీటు పోవటమంటే "రెడ్డిరాజ్యం పోవటమే"నని అనేక మోటారుల్లోనూ, రూపాల్లోనూ ప్రచారం చేశారు. అక్కడి ప్రజలు కమ్యూనిస్టు ప్రచారకుల్ని ఓర్పుతో విని ఆదరించారేగాని, భూస్వాముల పెత్తనాన్ని ఎదిరించి నిలబడి ఓటు చేయలేకపోయారు. ఫలితంగా ఆ నాలుగు పోలింగుల్లోనే కాంగ్రెసు అభ్యర్థికి నాలుగువేల మెజారిటీ వచ్చి దాదాపు యితర పోలింగు కేంద్రాల్లో కమ్యూనిస్టు అభ్యర్థికివచ్చిన మెజారిటీని కొట్టివేసింది.

సుసంఘటితమైన రూపంలో కాకపోయినా కమ్యూనిస్టు ఉద్యమంవున్న దుగ్గిరాల, ఈమని, చిలువూరు, కంచర్లపాలెం, కఠవరం మొదలైన ప్రాంతాల్లో గ్రామ పెద్దలందర్నీ, కమ్యూనిస్టు వ్యతిరేకులు ఏకం అయినా సగం ఓట్లు కమ్యూనిస్టుపార్టీకే వచ్చాయి.

కాంగ్రెసు, కృషికార్ లోక్, ప్రజాసోషలిస్టుపార్టీలు మూడూ కమ్యూనిస్టుపార్టీని ఓడించడమే ధ్యేయంగా పెట్టుకొని పని చేశాయి. కృషికార్ లోక్ పార్టీ నాయకుడు ఆచార్య రంగా తమకు గాకపోతే కాంగ్రెసుకే వేయమని ప్రచారం చేశాడు. సర్దార్ లచ్చన్న కమ్యూనిస్టు పార్టీయే మొదటి ప్రధాన శత్రువు అని ప్రకటించాడు. కల్లుగీత పనివారి ఓట్లు చీల్చేందుకుగాను గౌడకుల ప్రచారంకూడా చేశాడు. ఓట్లుకొని అయినా డిపాజిట్టు నిలబెట్టుకోవాలని ఎన్నికల [illegible] ప్రయత్నించారు. అయినా కృషికార్ లోక్ పార్టీకి గతంలోవలెనే యీసారి గూడా డిపాజిట్టు గల్లంతు అయింది. ఇరవైరోజులు మకాంవేసి, గడపగడపా తిరిగి ప్రచారంచేశాడు గనుక రంగాగారికే ఈ డిపాజిట్టు పోయినట్లుగూడా లెక్కవేయవచ్చు. ఇటు కాంగ్రెసు అభివృద్ధి నిరోధకత్వానికి వ్యతిరేకులైన వారితో చేతులు కలపడానికి తిరస్కరించారు. అటు కాంగ్రెసు అభ్యర్థిబలాన్ని ఏవిధంగానూ ద్వితీయంచేయలేకపోయారు. కాంగ్రెసుకే తోడుపడ్డారు.

గుణపాఠం

రాజకీయంగా ఒక్కొక్క నిర్ణయాలు తీసుకుంటేనే చాలదు. శాసన సభలోనూ, పార్లమెంటులోనూ వాటికోసం తీవ్రంగా పాటుబడితేనే సరిపోదు. కష్టజీవులైన వారిని సంబంధించిన కార్యక్రమంలో సమీకరించి, ప్రజాసంఘాల్లో వారిని కూడదీసి వారి హక్కులకొరకు పోరాటం ద్వారానే భూస్వామ్య అభివృద్ధి నిరోధకత్వానికి వెన్నెముక విరగగొట్టడం సాధ్యపడుతుందని స్పష్టపడుతోంది. అప్పుడే రాజకీయ నాయకత్వం వహించే ప్రజావ్యతిరేక కాంగ్రెసుకు పరాజయం కల్గుతుంది. ప్రజలకూ ప్రగతిశీలురకూ, [illegible] వారందరికీ దుగ్గిరాలనియోజకవర్గం చెబుతున్న గుణపాఠం ఇదే.

'భద్రతాసమితి వెంటనే మళ్ళీ సమావేశం గావాలి'

సమితి తీర్మానాన్ని పాటించని శత్రువుపై తగుచర్య తప్పకతీసుకోవాలని గౌతెమాలా విదేశాంగమంత్రి అభ్యర్థన

న్యూయార్కు, జూన్ 22

గౌతెమాలాలో యుద్ధవిరమణ చేయాలంటూ ఆదివారంనాడు భద్రతాసమితి ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానాన్ని శత్రుసేనలు పాటించలేదు కాబట్టి, అత్యవసరమైన చర్యలు తీసికునేందుకుగాను భద్రతాసమితి బుధవారంనాడే మరో సమావేశాన్ని ఏర్పాటుచేయాలని కోరుతూ గౌతెమాలా ప్రభుత్వం భద్రతాసమితి కొరకు అభ్యర్థనను ఈవేళ పంపింది.

గౌతెమాలా విదేశాంగమంత్రిపంపిన ఈ అభ్యర్థన ఈ క్రింది విధంగావుంది:

"నిన్న భద్రతాసమితి ఏకగ్రీవంగా యుద్ధవిరమణకు గురించిన తీర్మానాన్ని ఆమోదించింది; భద్రతా సమితి 25 వ నిబంధన ప్రకారం భద్రతా సమితిలో సభ్యత్వంవున్న దేశాలన్నీ ఆ తీర్మానానికి కట్టుబడవలసివుంది. అయినప్పటికీ, భద్రతాసమితి తీర్మానానికి వ్యతిరేకంగా, నిన్నరాత్రి, ఇవ్వాళగూడ మా దేశంమీద దురాక్రమణ జరుగుతూనేవుంది."

తర్వాత ఎక్కడెక్కడ ఎన్నెన్ని విమానాలు ఏయే పట్టణాలమీద, ఏయే రైలుమార్గాల మీద బాంబులు వేశాయో, ఎంత నష్టాన్ని కలిగించాయో ఆ ఫిర్యాదులో వివరించుతూ "మా మాతృదేశం మీద దాడిచేసిన విమానాలన్నీ గౌతెమాలా భూభాగానికి బయటవున్న విమానాశ్రయాల నుండే వచ్చాయన్న విషయాన్ని మరోసారి మీ దృష్టికి తెస్తున్నాను" అని గౌతెమాలా విదేశాంగ మంత్రి వ్రాశాడు.

ఆదివారంనాడు ఉదయం 8 గంటలకు ప్యుయర్టోబారియో రేవు పట్టణంలో మెషీన్‌గన్స్ మొదలైన యుద్ధ పరికరాలను దింపేందుకు వచ్చిన నావపై హోండురా పతాకంఎగురుతూ వున్నదనీ, ఆ నావను గౌతెమాలా సేనలు స్వాధీనపరచుకున్నాయనిగూడా ఆ ఫిర్యాదులో పేర్కొనబడింది.

కాబట్టి అవసరమైన చర్యలు తీసికునేందుకుగాను భద్రతాసమితివెంటనే బుధవారంనాడు సమావేశం కావాలని గూడా గౌతెమాలా ప్రభుత్వం కోరుతున్నది.

ప్రభుత్వసేనలదే పైచేయి

మూడు రంగాలలో శత్రుసేనలను ప్రభుత్వసేనలు ఓడించాయనీ, ప్రభుత్వసేనలు త్వరలోనే సంపూర్ణవిజయాన్ని సాధిస్తాయనీ గౌతెమాలా ప్రభుత్వం ఒక ప్రకటన చేసింది. మరో 24 గంటలలో ముఖ్యమైన యుద్ధం జరుగుతుందనీ, గౌతెమాలా ప్రభుత్వం రైతులకందరకూ యుద్ధపరికరాలను పంచిపెట్టిందనీ, రైతులందరూ ప్రాణాలనుగూడా వొడ్డి మాతృదేశ సంరక్షణ చేస్తున్నారనీ, గౌతెమాలా పట్టణం నుండి ఫ్రంటుమీద రాత్రింబవళ్లు సైనికులు వివిధ యుద్ధరంగాలకు పంపబడుతున్నారనీ గూడ తెలియవస్తోంది.

హోండురా విదేశాంగ మంత్రి పచ్చి అబద్ధాలు

హోండురా విదేశాంగ మంత్రి, జె. ఇ. వాల్లెంజుయేలా ఒక ప్రకటన చేస్తూ గౌతెమాలామీద జరిగే దాడికీ తమ ప్రభుత్వానికీ యేమీ సంబంధం లేదని అన్నాడు.

"గౌతెమాలామీద దాడి చేసేందుకని మాదేశంలో ఎలాంటి సైనిక సమీకరణ గూడా జరగలేదు" గౌతెమాలా మాదేశంమీద చేసిన నేరారోపణలను ఋజువు చేసుకోవలసినదని సవాలు చేస్తున్నాను." అనిగూడా హోండురా విదేశాంగ మంత్రి ఆ ప్రకటనలో అన్నాడు. ఇదేవిధమైన అభ్యంతరాన్ని నికరాగ్వా విదేశమంత్రిగూడా వెలిబుచ్చాడు.

గౌతెమాలా ప్రజలకు హవానా విద్యార్థుల అండదండలు

హవానా (క్యూబా), జూన్ 22

ఇక్కడివిద్యార్థులు 'గౌతెమాలాపై దాడి'ని నిరసిస్తూ ఒక మహాసభను ఏర్పాటు చేశారు. మహాసభ పూర్తి కాగానే, విద్యార్థులందరూ యూనివర్సిటీ ఆవరణలోకి వెళ్ళిపోయారు. తర్వాత కొంతసేపటికి యూనివర్సిటీ బయటకాపలాకాస్తున్న ఒక పోలీసుకు తుపాకి దెబ్బల మూలాన తీవ్రంగా గాయాలు తగిలాయట.

ఈ తుపాకి కాల్పులు యూనివర్సిటీ ఆవరణలోనుండే జరిగాయని పోలీసులంటున్నారు. పోలీసులు యూనివర్సిటీ ఆవరణలో ప్రవేశించి కొంతమందిని అరెస్టు చేశారు. గౌతెమాలామీద దాడిని నిరసించే కొన్ని కరపత్రాలనుగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

విద్యార్థులు ఏర్పాటు చేసిన మహాసభలో గౌతెమాలా మీద దాడికి, అమెరికాతోపాటు, గౌతెమాలాలోని యునైటెడ్ ఫ్రూట్ కంపెనీ, గూడ కారణమేనని విమర్శిస్తూ వుపన్యాసాలు చాలా తీవ్ర ధోరణిలో జరిగాయి.

మెక్సికోలో 'గౌతెమాలా మిత్రమండలి'

మెక్సికో, జూన్ 22

మెక్సికోలోని కొన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, కళాకారులు, ఉపాధ్యాయులు, రచయితలు కలిసి "గౌతెమాలా మిత్రమండలి" అనే ఒక సంస్థను స్థాపించారు.

ఈ సంస్థ గౌతెమాలామీద జరిగిన దురాక్రమణను నిరసిస్తూనూ, అమెరికా ప్రవర్తనను విమర్శిస్తూనూ ఒక ప్రకటనను చేసింది. మెక్సికోలోని మరో సంస్థ, '[illegible] శాంతిసంఘం' చేసిన ప్రకటనలో "అమెరికాలోని యుద్ధకాముక వ్యాపారులిచ్చిన నమ్మకంతోనూ, అమెరికా [illegible] చేస్తున్న కిరాయి సైనికుల దాడికి గౌతెమాలా బలి పశువౌతోంది" అని పేర్కొనబడింది.

"గౌతెమాలా కార్మికుల రక్తాన్ని పీల్చి లాభాలు సేకరించిన యునైటెడ్ ఫ్రూట్ కంపెనీ, గౌతెమాలామీద దురాక్రమణ జరిపేందుకు పశ్చిమార్ధగోళ [illegible] వుపయోగిస్తున్నది." అని మెక్సికోలోని కర్షక, కార్మిక సంఘాలంటున్నవి.

చౌ-ఎన్-లై స్వాగతానికి ఢిల్లీలో విపులసన్నాహాలు

[విశాలాంధ్ర విలేఖరి]

న్యూఢిల్లీ, జూన్ 23

చైనా ప్రధాని చౌ ఎన్ లై రేపు ఢిల్లీకి వస్తున్నాడన్న వార్త ఇక్కడ రాజకీయవర్గాలవారందర్నీ ఆశ్చర్యచకితులను చేసింది.

అసలు తన ఆహ్వానాన్ని చౌ-ఎన్ లై తక్షణమే అంగీకరిస్తారని ప్రధాని నెహ్రూకూడా అనుకోలేదు.

అందుకనే ఇదుగో వెంటనే వస్తున్నానని చౌ-ఎన్-లై వర్తమానం పంపించేసరికి ప్రధాని నెహ్రూకు కూడా ఆశ్చర్యం వేసింది. ఆయన తన సిమ్లా ప్రయాణ కార్యక్రమాలన్నీ రద్దు చేసుకొని చౌ ఎన్ లై రాకకు నిరీక్షిస్తూ ఢిల్లీలోనే వున్నారు.

అక్కడ వాషింగ్టన్‌లో బ్రిటీషు ప్రధాని చర్చిల్, అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ల సమావేశం అవడానికి కొంచెం ముందుగా ఇక్కడ ఢిల్లీలో చైనా భారతదేశాల ప్రధాన మంత్రులు సమావేశం అవడాన్ని గూర్చి పలువురు పలురకాలుగా ఊహాగానాలు చేస్తున్నారు.

చైనా ప్రధానిని కొనివచ్చేందుకు ఎయిరిండియా వారి ప్రత్యేక విమానం నిన్న బొంబాయినుంచి జెనీవాకు బయలుదేరి వెళ్ళింది. ఆ విమానంలో చైనా ప్రధాని చౌఎన్‌లై, ఆయన అనుచరులు 25 మంది వస్తారు. వారంతా సోమవారంనాడు ఈ విమానంలోనే చైనా ప్రయాణంచేస్తారు.

స్వాగత సన్నాహాలు

ఇక ఢిల్లీలో చైనా ప్రధానికి స్వాగతం ఇవ్వడంకోసం సన్నాహాలు మహాకోలాహలంగా జరుగుతున్నాయి. చైనా ప్రధాని ఇక్కడకు రావడంలోగల అంతరార్థాలను లాభాలనువివరిస్తూ అనేక పత్రికలు సంపాదకీయ వ్యాఖ్యానాలు రచించాయి. కొన్ని చౌఎన్‌లై వ్యక్తిత్వంలో ఉన్న గొప్పతనాన్ని ఉగ్గడిస్తూ వ్రాశాయి. చైనా - భారత ప్రధానుల సమావేశం వల్ల ఆసియా దేశాల సంబంధాలు మరింత సన్నిహితం కాగలవనీ, ఆసియాను కబళించాలని చూసే పశ్చిమరాజ్యాలకు ఈ సమావేశం పక్కలో బల్లెం కాగలదనీ పత్రికలు వ్రాశాయి. ప్రపంచంలో సగం జనాభాకు ప్రాతినిధ్యం వహించే ఇద్దరు మహా వ్యక్తుల సమావేశంగా ఈ సమావేశాన్ని చిత్రించాయి.

చౌ-ఎన్-లై ఇక్కడవుండే మూడు రోజుల కార్యక్రమం తాలూకు వివరాలింకా తయారు కాలేదు. కాగా ఆయన రాజఘాట్‌కు వెళ్ళి గాంధీగారి సమాధికి పుష్పాంజలి సమర్పించడం మాత్రం ఆ కార్యక్రమంలో తప్పకుండా వుండివుంటుంది.

లోగడ చైనాలో భారత రాయబారిగా పనిచేసిన సర్దార్ పణిక్కర్ తను కార్యక్రమాల నన్నిటినీ రద్దు చేసుకొని హుటాహుటిన ఢిల్లీకి వస్తున్నారు. చౌ-ఎన్-లై కార్యక్రమాలన్నింటిలోను పాల్గొనాలని ఆయన సంకల్పం.

చౌఎన్‌లైతో ఫ్రెంచి ప్రధాని భేటీ

బెర్నుకి ఆగమనం

పారిస్, జూన్ 23

ఫ్రెంచిప్రధాని పెరీ మెండే-ఫ్రాన్సు నిన్నరాత్రివిమానంలోస్విట్జర్లాండురాజధాని బెర్నుకి చేరుకొన్నాడు. అక్కడ ఆయన చైనాప్రధానిచౌఎన్‌లైని నేడు కలుసుకొని ఇండో చైనా సమస్యపై సంప్రదిస్తాడు.

ఫ్రెంచి, చైనా ప్రభుత్వాల మధ్య ఇంతవరకు రాయబార సంబంధాలు లేవు. ఫ్రెంచి మాజీ విదేశాంగ మంత్రి బిడాల్టు పాల్గొన్నకాలంలో ఏడు వారాలు జెనీవా చర్చలు జరిగినా ఒక్కమారు కూడా ఆయన చైనాప్రధానిని కలుసుకోలేదు. ఆ మొరటుతనాన్ని ఫ్రెంచి పార్లమెంటులో మెండే - ఫ్రాన్సు తీవ్రంగా నిరసించి, తాను నెలలో ఇండోచైనాకు శాంతిని సాధించలేకపోతే గద్దె దిగుతానని వాగ్దానం చేశాడు.

నిన్న మెండే-ఫ్రాన్సు పత్రికా విలేఖరుల సభలో ప్రసంగించాడు. అక్కడ చైనా ప్రధానినికలుసుకోవడం చైనాను గుర్తించినట్లవుతుందాయనే ప్రశ్నకు సమాధానంఇస్తూ ప్రస్తుతచర్చనీయాంశాలలో ఆ సమస్య లేదన్నాడు.

తాను చౌ - ఎన్ - లైని కలుసుకొనదలచినట్లు మొన్న ఆదివారంనాడు బ్రిటిష్‌విదేశాంగమంత్రి ఈడెన్‌కు తెలియపరచానని చెప్పాడు. తన ఆలోచనలను వియత్నామ్ ప్రభుత్వానికెప్పటికప్పుడు తెలుపుతూనే వున్నాననీ, బెర్నులో వియత్మిన్ ప్రతినిధిని కలుసుకొనే ప్రయత్నం లేదనీ మరొక ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చాడు.

తన మంత్రివర్గం నూతన ఆర్థిక విధానంలోని ప్రధాన విషయాల పరిశీలన ప్రారంభించ దలచిందనీ, ఆ ప్రణాళికను తయారు చేయడానికై నిపుణుల సంఘం వెంటనే నియమించబడుతుందనీ ప్రధాని విలేఖరులతో చెప్పాడు.

యూరపురక్షణ ఒడంబడికకు ఒక విధంగా విస్తృత ప్రాతిపదికపై ఒప్పందం కుదిరేట్లు మంత్రివర్గం ప్రయత్నిస్తుందనీ, రక్షణ శాఖా మంత్రి కోనిగ్, వ్యాపార, వాణిజ్య శాఖామంత్రిమారిస్ బూర్జే-మనోరీలు ఆసమస్యను గురించి చర్చించేటందుకు ఈ వారాంతంలోగా [illegible] కలుసుకొంటారనీ చెప్పాడు.

కోనిగ్ డిగాల్ పార్టీవాడు. యూరపు రక్షణ ఒడంబడికకు పూర్తి వ్యతిరేకి. బూర్జే - మనోరీ ఆఒడంబడికకు పూర్తి అనుకూలుడు.

ఆంధ్ర హైకోర్టు స్థాపన సందర్భంలో విశాలాంధ్ర ప్రత్యేక సంచిక

ఆంధ్ర ప్రజల కృషి ఫలితంగా అందరికీ అందుబాటులోవున్న గుంటూరులో ఆంధ్ర హైకోర్టు జూలై 5 తేదీన ప్రారంభించ నున్నారు.

ఈ సందర్భంలో ఆంధ్ర హైకోర్టుకై ఆంధ్ర ప్రజల కృషి, మొదలైన యితర వివరాలతో విశాలాంధ్ర ప్రత్యేక సంచిక వెలువడుతుంది.

ప్రకటనలు పంపువారు జూలై 2 వ తేదీ లోగా మా ఆఫీసుకు అందజేయగలరని ఆశిస్తున్నాం.

— మేనేజరు.

1954 జూన్ 24 గురువారం
జయ సంవత్సర
జ్యేష్ఠ బహుళ
అష్టమి ప. 10-8
ఉత్తరాభాద్ర ప. 1-23

విశాలాంధ్ర

24-6-54 గురువారం

దుగ్గిరాల నియోజకవర్గ ఎన్నిక ఫలితాలు

దుగ్గిరాల నియోజకవర్గంలో నెల రోజులుగ జరిగిన ఎన్నికల సంరంభం ముగిసింది. ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. జనరల్ ఎన్నికలనాటికంటె, ఎక్కువమంది వోటర్లు వోటింగులో పాల్గొన్నారు. నాడు 45 వేలకు పైగా పోలయితే నేడు 48 వేలకు మించిపోలయ్యాయి. కాంగ్రెసు గత ఎన్నికల్లో 1700 మెజారిటీతో సీటు గెల్చుకుంటే నేడు 1282 తో బ్రతికి బయట పడ్డది. 10వేల మెజారిటీ తమకు వస్తుందని సంజీవరెడ్డిగారు చేసిన ప్రకటనలుబుకాయింపని తేలింది కమ్యూనిస్టుపార్టీ జనరల్ ఎన్నికల్లో యీ నియోజకవర్గంలో ఏ నిష్పత్తిలో ఓట్లు పొంద గలిగిందో, ఆ నిష్పత్తికి మించే - కొద్దో గొప్పో - నేడు కూడ పొందగల్గింది. తమపార్టీకి సీటు రాకపోతే తాను రాజకీయాలనుండి విరమించి సన్యసిస్తానని, పార్టీ నాయకుడు రంగాగారు బెదిరించినా, కృషిక్ లోక్ వారికి నియోజకవర్గంలో రెండవ సారి డిపాజిట్టు పోయింది.

ఆంధ్రదేశంలో రాష్ట్రసాధన సమస్యపైన, రాజధాని హైకోర్టుస్థల నిర్ణయ సమస్యలపైన, ప్రాజెక్టుల విషయంలో, పన్ను భారాలుపెంచే పథకాలపైన, మద్యనిషేధం, బంజర్లు పంపిణీ వగైరా బహుళ సమస్యలపైన అపఖ్యాతిపాలైన ఆంధ్ర కాంగ్రెసు ప్రభుత్వం. కాంగ్రెసు పార్టీ దుగ్గిరాల నియోజకవర్గంలో ఎలా గెల్వగల్గిందని పలువురు ఆశ్చర్యంతో ప్రశ్నించుతున్నారు. పైనవివరించిన ఆంధ్ర ప్రజా, జాతీయ సమస్యల్లో ప్రజలకు ప్రత్యక్షంగా నాయకత్వం వహించినడిపిన కమ్యూనిస్టుపార్టీ ఎందుకు గెలువలేక పోయిందని కూడ ప్రశ్నించుతున్నారు. రంగాగారిపార్టీ వహించిన రాజకీయపాత్ర ఎలాంటిదని కూడ తెలుసుకొన కుతూహల పడుతున్నారు.

రంగాగారి కృషిక్ లోక్ పార్టీ ఓట్లను చీల్చి, పరోక్షంగా కాంగ్రెసు విజయానికి చేతనయినంత పని చేసింది. అందుకు ఆంధ్ర కాంగ్రెసు నాయకత్వం రంగాగారిని ఎంతైనా అభినందించ వలసిందే! రంగాగారు రాజకీయ ఉగ్గుపాలతోనే కమ్యూనిస్టు వ్యతిరేక విషాన్ని రంగరించి పోసిన శ్రీ వారి శిష్యబృందం, ఎన్నికల ఉపన్యాసాలలోను, పత్రికా ప్రకటనల్లోను, ప్రచారంలోను, నీచాతినీచమైన కమ్యూనిస్టు వ్యతిరేకత కక్కారు. ఇట్టి విష ప్రచారం. కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా రంగంలో ప్రధానంగా నిలబడ్డ కాంగ్రెసుకు ఉపయోగించిందే కాని వేరుగాదని ఫలితాలే ఋజువు చేస్తున్నాయి. మరోసారి డిపాజిట్టు గల్లంతయ్యేవరకు మనశ్శాంతిలేక నిద్రపట్టని రంగాగారికి సుఖంగా నిద్రించ వచ్చు.

కాంగ్రెసు విజయానికి, కమ్యూనిస్టుపార్టీ ఓటమికి దారితీసిన పరిస్థితులను గూర్చి ఒక పత్రికా వ్యాఖ్యాత కాంగ్రెసు అభ్యర్థి గనుక గెలిస్తే, అందుకు కారణం సంజీవరెడ్డిగారి కర్నూలు రాజకీయాలు కానేరవని, శ్రీ గోపాలరెడ్డి, చంద్రమౌళిగార్ల కొత్త కాంగ్రెసు నాయకత్వమని వ్రాశాడు. ఏళ్ళతరబడి మంత్రి పదవులు నిర్వహించి ఎన్నికల్లో చిత్తయిపోయిన మాజీ మంత్రిద్వయంమహిమా? లేక మంత్రిగానే తంతు నడుపుతూ 'కర్నూలు రాజకీయాల' సృష్టికర్తయిన సంజీవరెడ్డిగారి మహిమా? అని తర్జన భర్జన చేస్తే, తేలేది పూజ్యమని చెప్పాలి. ఏదైనా ఒక 'మహిమ'అంటూఉంటే, అది ఆనియోజకవర్గంలోని అనేక గ్రామాలలో తరతరాలుగ పీఠాలు నిర్మించుకున్న భూస్వాముల, ధనికరైతుల 'మహిమ' అని మాత్రమే చెప్పాలి. ఏ గ్రామాలలో దేవాదాయ భూములను, పంచాయితీబోర్డు ఆదాయాలను కోఆపరేటివు బ్యాంకుల ఖజానాలను వగైరా తమ గుప్పెట్లో పెట్టుకొని, కొన్ని తరగతుల ప్రజానీకాన్ని తమ ఇనుపకౌగిళ్ల మధ్య నేటికీ బంధించగలిగియున్నారో వారంతా కాంగ్రెస్ విజయానికి కంకణం గట్టుకొని పని చేశారు. కమ్యూనిస్టు విజయమంటే, తమ విషపు కోరలు పీకి వేయడమేనన్న హడలుతోనే, కంపుగొడుతున్నప్పటికీ కాంగ్రెసుపార్టీ విజయానికి మూగారు. నియోజకవర్గంలో ఏ గ్రామాల్లో కూలీ పేదరైతు పీడితప్రజలను వారి సమస్యలపై కమ్యూనిస్టుపార్టీ గతంలో సంఘటితపర్చి అచటి భూస్వామ్య, ధనికరైతు నిరంకుశ పీఠాలను కదిల్చిందో, పెకల్చిందో, అధిక సంఖ్యాక ప్రజలను వారి విషకౌగిలి నుండి వదిలించిందో అచట కాంగ్రెసు పార్టీ ఆటలు సాగలేదు. సంజీవరెడ్డిగారి తంత్రాలు పని చేయలేదు; గోపాలరెడ్డి, చంద్రమౌళిగార్ల మంత్రాలు పారలేదు. అచట కమ్యూనిస్టు అభ్యర్థికి అఖండ విజయమే చేకూర్చారు.

విశాలమైన ఆంధ్ర జాతీయ సమస్యలన్నింటిపైన కమ్యూనిస్టు పార్టీ, గత రెండేళ్ళకుపైగా అప్రతిహతమైనసేవచేసిందనిఅంగీకరించే భూస్వామి, ధనికరైతువర్గాలు సహితం, అధికారంలో కమ్యూనిస్టుపార్టీది పైచేయి అవుతుందనేభీతి పుట్టే కొద్దీ, కాంగ్రెసుకు కాయకల్ప చికిత్స ప్రారంభించారు. కాంగ్రెసు విజయానికి మూల రహస్యం ఇదీ. వీలున్న చోటల్లా కుల,మత, శాఖతత్వాలను అవసరాలకొద్దీ వాడుకుంటూనే, కుల మత విచక్షణలేకుండా భూస్వామి బృందమంతా ఏకమై కాంగ్రెసుకు ఆ సీటు దక్కించుకున్నారు. తద్వారా గ్రామాల్లో తమ బ్రతుకును బలపర్చుకో యత్నిస్తున్నారు. వీరి విషకౌగిలి నుండి బయటపడిన పీడిత ప్రజలంతా, కులమత విభేదాలను ప్రక్కకునెట్టి, కమ్యూనిస్టు అభ్యర్థికి వోట్లిచ్చారు.

ఆఖరుకు, ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వాధికారం అనువుగ ఉపయోగించింది: పర్మిట్లవారు, లైసెన్సులవారు, మంత్రుల చుట్టూ మూగి, అడిగిన వరాలు కొన్ని పుచ్చుకొని, అధికారానికిదాసోహమన్నారు. కాంగ్రెసుకు వంతపాట పాడారు.

ఈ ఉప ఎన్నికలో, కాంగ్రెస్ ప్రభుత్వ పాలసీలనో, కాంగ్రెసు పార్టీ కొత్త నాయకత్వానికో విజయం చేకూరిందనుకోవడం ఆత్మవంచన చేసుకోవడమవుతుంది. నియోజకవర్గంలో కరడుగట్టిన భూస్వామి వర్గానికింకా మిగిలియున్న ప్రాబల్యమే కారణమనీ, దాన్ని నిర్మూలించడానికిఅభ్యుదయశక్తులింకాఅనేక వర్గ పోరాటాలు సాగించాలనీ, ఒకే ఒక పాఠం, ఈ ఉప ఎన్నిక మనకిస్తోంది.

నవచైనా రాజ్యాంగ చట్టం ముసాయిదా: (1)

సోషలిస్టు సమాజ స్థాపనకు ముందు పరివర్తన దశలో ప్రభుత్వ కర్తవ్యాలు

వివిధ వర్గాలయెడ ప్రభుత్వ విధానం

జూన్ 14 వ తేదీని చైనా ప్రజాప్రభుత్వ కేంద్ర కౌన్సిల్ సమావేశమై, చైనా ప్రజారిపబ్లిక్ రాజ్యాంగ చట్ట ముసాయిదాను అంగీకరించి ప్రజాభిప్రాయానికి దాన్ని విడుదల చేసింది. అందులోని ప్రధానభాగాలను వరుసగా 'విశాలాంధ్ర'లో ప్రకటిస్తాం. నవచైనా వార్తాసంస్థచే యిది ప్రకటింప బడింది. మొదటిభాగం దిగువ యిస్తున్నాం.

చైనా రాజ్యాంగచట్ట ముసాయిదా యీ క్రింది ఉపోద్ఘాతంతో ప్రారంభమవుతుంది.

ఉపోద్ఘాతం

చైనా ప్రజలు సుమారు నూరు సంవత్సరాల వీరోచిత పోరాటం తర్వాత, 1949 లో కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన ప్రజావిప్లవంలో అఖండ విజయం సాధించారు. సామ్రాజ్యవాదాన్నీ, భూస్వామ్య విధానాన్నీ, గుత్తపెట్టుబడిదారీ విధానాన్నీ ఓడించి దీర్ఘకాల దోపిడీని, బానిసత్వాన్ని తుదముట్టించారు. చైనా ప్రజారిపబ్లిక్ను, నూతన ప్రజాతంత్ర నియంతృత్వాన్ని స్థాపించుకున్నారు. నవచైనా శాంతియుత పద్ధతులతో దోపిడీని, దారిద్ర్యాన్ని నిర్మూలించి సుఖ సంపదలతో అలరారే సోషలిస్టు సమాజాన్ని నిర్మించుకోవచ్చునని చైనా ప్రజా రిపబ్లిక్ యొక్క నూతన ప్రజాస్వామ్య వ్యవస్థ హామీ యిస్తోంది.

పరివర్తన దశ

చైనా ప్రజారిపబ్లిక్ స్థాపింపబడినదిలగాయతు సోషలిస్టు సమాజం నిర్మింపబడే వరకు గడిచే దశ పరివర్తన దశ. ఈ దశలో ప్రభుత్వం నిర్వహించవలసిన ప్రధాన కర్తవ్యం క్రమక్రమంగా పారిశ్రామిక రంగంలో సోషలిస్టు విధానాన్ని అమలుజరపడం; వ్యవసాయం, చేతివృత్తులు, పెట్టుబడిదారీ పరిశ్రమలు వ్యాపారరంగాల్లో సోషలిస్టుపద్ధతులను క్రమక్రమంగా ప్రవేశపెట్టడం. గత కొద్ది సంవత్సరాల్లో చైనాప్రజలుజయప్రదంగా భూసంబంధాలనుసంస్కరించుకోగలిగారు. అమెరికా దురాక్రమణను ప్రతిఘటించి కొరియాకు సహాయం చేశారు; విప్లవప్రతీఘాతక శక్తుల్ని అణచివేశారు; ఆర్థికవిధానాన్ని పునర్నిర్మించుకున్నారు. అనేక యితర చర్యల ద్వారా ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థ నెలకొల్పడానికి, క్రమేణా సోషలిస్టు సమాజంగా అది పరివర్తన చెందడానికి అవసరమైన పరిస్థితులనీ, కల్పించారు.

ప్రజాతంత్ర ఐక్య సంఘటన

చైనా ప్రజారిపబ్లిక్ స్థాపనకు జరిగిన పోరాటంలో చైనా ప్రజలు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం క్రింద విస్తృతమైన ప్రజాతంత్ర ఐక్య సంఘటనను నిర్మించారు. ఇందులో అన్ని ప్రజాతంత్ర వర్గాలు, పార్టీలు, గ్రూపులు, ప్రజాసంఘాలు ప్రాతినిధ్యంవహిస్తున్నాయి. ఇక ముందుకూడా పరివర్తన దశలో యీ ఐక్యసంఘటన ప్రభుత్వం ప్రధాన కర్తవ్యాలను నెరవేర్చడంలోను, ఇంటా బయటా శత్రువుల్ని ప్రతిఘటించడంలోను దేశవ్యాపితంగా చైనా ప్రజలందరినీ సమీకరించి సమైక్యపరచడానికి కృషి చేస్తుంది.

వివిధజాతుల సమిష్టికుటుంబం

చైనాలో వివిధజాతుల ప్రజలు ఐక్యతతోను, స్వేచ్ఛతోను, సమాన హోదాతోను పెద్దసమిష్టికుటుంబంగా నివసిస్తున్నారు. ఈ ఐక్యత పరస్పర స్నేహ సహకారాల ప్రాతిపదికపై, సామ్రాజ్యవాద వ్యతిరేకత ప్రాతిపదికపై, వివిధ జాతుల ప్రజలు తమ సమిష్టి శత్రువుల్ని ప్రతిఘటించే ప్రాతిపదికపై, పెద్దజాతుల దురహంకారాన్నీ స్థానిక జాతీయ దురహంకారాన్నీ ఎదుర్కొనే ప్రాతిపదికపై మరింత బలపడుతుంది. ప్రభుత్వం ఆర్థిక సాంస్కృతికాభివృద్ధిని సాధించడంలో వివిధ జాతుల అవసరాలను కాపాడుతుంది. క్రమానుగతంగా సోషలిస్టు సమాజాన్ని నిర్మించే విషయంలో వివిధ జాతుల ప్రత్యేక లక్షణాలను, పరిణామగతిని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొంటుంది.

విదేశాంగ విధానం

చైనా ప్రజారిపబ్లిక్ సోవియట్ యూనియన్తోను, నూతన ప్రజాతంత్ర రిపబ్లిక్లతోను యిదివరకే సుస్థిరమైన స్నేహ సంబంధాలను కలిగియుంది. చైనా ప్రజలకూ ప్రపంచంలోని శాంతికాముక ప్రజలకూ మధ్య స్నేహం రోజు రోజుకూ పెంపొందుతోంది. ఇది ముందు ముందు మరింత పెరుగుతుంది; మరింత దృఢపడుతుంది. వివిధ దేశాలతో సమానత్వం, పరస్పర లాభం, స్వాతంత్ర్య హోదా అనే సూత్రాల ప్రాతిపదికపై చైనావివిధ దేశాలతో పెంపొందించుకొంటున్న రాజకీయ సంబంధాలుఎన్నో సత్ఫలితాలిచ్చాయి. ఈ ధోరణి యికముందు కూడా కొనసాగుతుంది. విదేశాంగ వ్యవహారాల్లో మనం ప్రపంచ శాంతి కొరకు కృషి సల్పుతాం; మానవజాతి పురోభివృద్ధికి పాటుపడతాం.

మొదటి అధ్యాయం:

సాధారణ సూత్రాలు

చైనా ప్రజారిపబ్లిక్ కార్మికవర్గ నాయకత్వం క్రింద కార్మిక కర్షక సమైక్యతపై ఆధారపడే నూతన ప్రజాతంత్ర ప్రభుత్వం.

చైనా ప్రజారిపబ్లిక్లో అధికారమంతా ప్రజలది. ఈ అధికారాన్ని ప్రజలు నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ ద్వారాను, వివిధ స్థాయిలలో నెలకొల్పబడే స్థానిక పీపుల్స్ కాంగ్రెస్ల ద్వారాను చలాయిస్తారు.

నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్, వివిధ స్థాయిలలో నెలకొల్పబడే స్థానిక పీపుల్స్ కాంగ్రెస్లు, తదితర రాజ్యాంగ సంస్థలు యెట్టి మినహాయింపులు లేకుండా కేంద్రీకృత ప్రజాస్వామ్యమనే సూత్రాన్ని అమలుజరుపుతాయి.

చైనా ప్రజారిపబ్లిక్ వివిధ జాతులతో కూడిన సమైక్య ప్రభుత్వం. అన్ని జాతులకు సమాన హక్కులున్నాయి. కొన్ని జాతులపట్ల విచక్షణ చూపటం, అణచియుంచటం, జాతుల ఐక్యతను విచ్ఛిన్నం చేయబూనుకోవటం లాంటి చర్యలు నిషేధింపబడతాయి. అన్ని జాతులు తమ భాషలను అభివృద్ధి చేసుకోడానికి, తమ సంప్రదాయాలను, అలవాట్లను, మత విశ్వాసాలను కాపాడుకోడానికి లేదా సంస్కరించుకోడానికి స్వేచ్ఛను కల్గియుంటాయి. అల్పసంఖ్యాక జాతులు నివసించే ప్రాంతాలలో ప్రాంతీయ స్వపరిపాలనాధికారం ఉంటుంది. ఇట్టి ప్రాంతాలన్నీ చైనా ప్రజారిపబ్లిక్లో భాగాలే.

చైనా ప్రజారిపబ్లిక్ ప్రభుత్వసంస్థల మీద, వివిధ సామాజికశక్తులమీద, ఆధారపడుతూ దోపిడీ పద్ధతులన్నిటినీ క్రమానుగతంగా రద్దుచేస్తుంది. సోషలిస్టు పరిశ్రమలను పెంపొందించడం ద్వారా సోషలిస్టు సమాజాన్ని నిర్మించడానికి తగు పరిస్థితులను కల్పిస్తుంది.

ఉత్పత్తి సాధనాలపై వివిధ రకాలైన యాజమాన్యం

ప్రస్తుతం ప్రజారిపబ్లిక్లో ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం ఈ క్రింది రకాలుగా ఉంటుంది: ప్రభుత్వ యాజమాన్యం — అనగా ప్రజలందరి యాజమాన్యం; సహకార సంస్థల యాజమాన్యం; కష్టజీవుల వ్యక్తిగత యాజమాన్యం; పెట్టుబడిదారుల యాజమాన్యం.

ప్రభుత్వ యాజమాన్యం క్రిందనున్న ఆర్థికవ్యవస్థ సోషలిస్టు ఆర్థికవ్యవస్థ. ప్రజలే దానికి యజమానులు. జాతీయ ఆర్థికవిధానంలో ఇదే అగ్రగామి. ఈ ప్రాతిపదికపైన ప్రభుత్వం సోషలిస్టు సమాజాన్ని రూపొందిస్తుంది. ప్రభుత్వ యాజమాన్యంక్రింద ఉండే సంస్థల అభివృద్ధికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుంది. ఖనిజసంపద,నదీజలాలు,అడవులు బంజరుభూములు మొదలైనవన్నీ చట్టం ప్రకారం ప్రభుత్వ ఆస్తి. ప్రజలందరూ వాటికి యజమానులు.

సహకార ఆర్థిక విధానమంటే, కష్టజీవులైన ప్రజాసామాన్యం సమిష్టిగా యాజమాన్యం కలిగివున్న సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ ఐనా కావచ్చు; కష్టజీవులకు కొంతవరకు మాత్రమే సమిష్టి యాజమాన్యంగల అర్ధసోషలిస్టు ఆర్థికవ్యవస్థ ఐనా కావచ్చు. కష్టజీవుల సమిష్టి యాజమాన్యం కొంతవరకే ఉండే పద్ధతి పరివర్తనదశ. ఈ పద్ధతిద్వారా వ్యక్తిగత రైతులు, వ్యక్తిగత చేతివృత్తులవారు, ఇతర వ్యక్తిగత కష్టజీవులు సమిష్టి యాజమాన్యంవైపు పురోగమించడానికి సంఘటితమౌతారు. ప్రభుత్వం సహకార సంస్థలఆస్తిని రక్షిస్తుంది. సహకార ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహిస్తూ దానికి సహాయం చేస్తుంది. వ్యక్తిగత వ్యవసాయం, వ్యక్తిగత చేతి వృత్తుల ద్వారా ఉత్పత్తిచేసే పద్ధతిని మార్చివేయడంలో ఒక సాధనంగా ఈ సహకారోత్పత్తి విధానం ఉపకరిస్తుంది.

రైతులయెడ ప్రభుత్వ విధానం

రైతులు చట్ట ప్రకారం భూమిని, ఇతర ఆస్తిని కలిగివుండే హక్కు ప్రభుత్వంచే రక్షించబడుతుంది. వ్యక్తిగత రైతులు ఉత్పత్తిని పెంచడంలో ప్రభుత్వం సహాయంచేస్తూ ముందుండి నడుపుతుంది. ఐచ్ఛికంగా ఉత్పత్తి సహకార సంస్థలు, సప్లయి సహకార సంస్థలు, మార్కెటింగు సహకార సంస్థలు, అప్పుల సహకార సంస్థలు నిర్మించుకోవడంలో ప్రభుత్వం ప్రోత్సాహమిస్తుంది. ధనిక రైతు ఆర్థిక వ్యవస్థను పరిమితం చేసి క్రమక్రమంగా దాన్ని తొలగించడమే ప్రభుత్వవిధానం.

చేతి వృత్తులవారు, వ్యవసాయం చేయని ఇతర వ్యక్తిగత కష్టజీవులు చట్టం ప్రకారం ఉత్పత్తి సాధనాలను, ఇతర ఆస్తిని కలిగియుండే హక్కు ప్రభుత్వంచే రక్షింపబడుతుంది. వారు తమ వ్యవహారాలను చక్కదిద్దుకోవడంలో ప్రభుత్వం తోడ్పడుతుంది. ఐచ్ఛికంగా ఉత్పత్తి సహకారసంస్థలు, సప్లయి సహకార సంస్థలు, మార్కెటింగు సహకారసంస్థల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తుంది.

(మిగతా 3 వ పేజీ—)

కెన్యాలో భారతీయ పత్రికా సంపాదకుని అరెస్ట్

విడుదలచేయాలని

ఫెన్నర్ బ్రాక్వే అభ్యర్థన

నైరోబీ, జూన్ 21

కెన్యాలో, అత్యవసర పరిస్థితులేర్పడినందువల్ల, నైరోబీలోని 'డైలీ క్రానికల్' పత్రికా సంపాదకుడు గడచిన వారాంతంలో డిటెయిన్ చెయ్యబడ్డాడని కెన్యా పోలీసులు చెప్పారు.

ఈ సంపాదకుని పేరు పి. జి. పింటో. ఈయన భారతీయుడు. ఈయన్ను అరెస్టు చేసేందుకుగల కారణాలను పోలీసులు చెప్పటంలేదు. కాని ఈ అరెస్టుకూ, పత్రికా ప్రచురణకూ ఏమీ సంబంధంలేదని కెన్యా ప్రాంత సి. ఐ. డి. ఆఫీసరు చెప్పాడు.

శ్రీ పింటో గోవాలో జన్మించాడు. బొంబాయిలో చదువుకున్నాడు. 1848 నుండి నైరోబీలో 'డైలీ క్రానికల్' అనే దిన పత్రికను నడుపుతున్నాడు. ఈ పత్రిక 3 వేల కాపీలు అమ్ముడుపోతుందట. 'ప్రజా రక్షణ చట్టం' క్రింద ఈయనిప్పుడు డిటైన్ చేయబడ్డాడు.

'సలహా' సంఘానికి అప్పీలు చేసుకునే హక్కు శ్రీ పింటోకు వున్నది. ఈ అప్పీలులో విజయం పొందితే ఈయన విడుదల చేయబడతాడట. లేకుంటే, ఇంతకాలమంటూలేకుండా, అత్యవసరపరిస్థితులు అంతమయ్యేవరకూ డిటెన్షన్లోనే వుంటాడు.

లేబర్ పక్ష సభ్యుడు ఫెన్నర్ బ్రాక్వే, ఈ సంపాదకుడిని విడుదల చేయవలసిందని కోరుతూ, వలసదేశాల కార్యదర్శి, లిట్టిల్టన్కు ఒక జాబు వ్రాశాడు.

చైనాలో విప్లవ ప్రతీఘాతకులకు మరణశిక్ష

హాంకాంగ్, జూన్ 21

విప్లవ ప్రతీఘాతకులను ఇరవైమందిని నవచైనా ప్రభుత్వం ఉరితీసిందనీ, ముప్ఫైమందికి జైలుశిక్ష విధించిందనీ, కమ్యూనిస్టు పత్రిక "పీపుల్స్ డైలీ" నేడు ప్రకటించింది.

చాంగ్-కై-షేక్ ప్రభుత్వకాలంలో ఈ ద్రోహులు 19 మంది కమ్యూనిస్టు నాయకులు బ్రతికి వుండగానే పూడ్చిపెట్టారు. ఈ ముఠా తిరిగి రహస్యంగా 1950 లో పునర్నిర్మాణమై, పెకింగ్, టీన్ స్టిన్ లలో దోపిడీలు ప్రారంభించింది. 17 జిల్లాలలో బందిపోట్లు చేసింది.

దొమ్మీలు కల్పించాలని కుట్రచేసినవారిలో ఒక మాజీ సేనాని యాంగ్ పింగ్ లీ అనే అతడు ఉన్నాడు. అతని నాయకత్వాన హోపే రాష్ట్రంలో "కమ్యూనిస్టు వ్యతిరేకసైన్యం" అనే సంస్థ ఒకటి ఏర్పడింది. ఆ సభ్యులే ఈ కుట్రదారులు.

హైకోర్టు ప్రారంభోత్సవానికి సెలవు ఇవ్వాలని లాయర్ల అభ్యర్థన

కర్నూలు, జూన్ 22

ఆంధ్ర హైకోర్టు ప్రారంభోత్సవం జరిగే జూలై 5 వ తేదీన ప్రభుత్వం సెలవుగా ప్రకటించాలని లాయర్లు ప్రభుత్వాన్ని అభ్యర్థించినట్లు తెలుస్తోంది. నిన్నటి విశాలాంధ్రలో ప్రభుత్వం ఆరోజును సెలవుదినంగా ప్రకటించిన వార్త పొరపాటున పడింది.

ఆంధ్ర ప్రభుత్వ కార్యాలయ ఉద్యోగుల సంఘం

కర్నూలు, జూన్ 28

ఆంధ్రప్రభుత్వ ఉద్యోగుల కార్యాలయ సంఘానికి 1954-55 సంవత్సరానికి అధ్యక్షుడుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఓ. పుల్లారెడ్డిగారు ఎన్నిక అయ్యారు.

భారత - చైనా ఒడంబడిక ఆసియా శాంతికి రక్షాబంధం

కలకత్తాలో టిబెట్ సమస్యపై జరిగిన గోష్ఠిలో ప్రముఖుల ప్రసంగాలు

[విశాలాంధ్ర విలేఖరి]

కలకత్తా, జూన్ 22

"భారత - చైనా దేశాల మధ్య టిబెట్టుతో వాణిజ్య, సాంస్కృతిక సంబంధాలనుగూర్చి జరిగిన ఒడంబడిక కేవలం వాణిజ్య ఒడంబడిక మాత్రమేగాదు. ఆ ఒడంబడిక ఆసియా శాంతికేగాక ప్రపంచశాంతికి రక్షాబంధంవంటిది" అని కలకత్తాలో జరిగిన ఒక గోష్ఠిలో పాల్గొన్న ప్రముఖ వక్తలు ప్రసంగించారు.

ఈగోష్ఠి భారత-చైనా మిత్రమండలి కలకత్తాశాఖ అధ్వర్యాన ఏర్పాటు చేయబడింది. కలకత్తా విశ్వవిద్యాలయంలో చైనా చరిత్ర అధ్యాపకులు ప్రొఫెసర్ త్రిపురారి చక్రవర్తి, ప్రొఫెసర్ హీరేన్ ముఖర్జీ, ప్రొఫెసర్ నిర్మల్ భట్టాచార్యగార్లు టిబెట్టు సమస్యపై జరిగిన ఈ గోష్ఠిలో ప్రసంగించారు. చైనా ప్రజాసైన్యాలు టిబెట్టులో ప్రవేశించడం దురాక్రమణ చర్య అనీ, చైనాతో 18 వందలమైళ్ళ పొడవున సరిహద్దు కలిగివున్న భారత దేశానికి ప్రమాదం ఏర్పడిందనీ, టిబెట్టుపైభారత దేశానికిగల హక్కులను నెహ్రూ వదిలివేశాడని కొంతమంది చేస్తున్న ఆరోపణలకు జవాబు చెప్పడానికే ఈగోష్ఠి యేర్పాటు చేయబడింది. గోష్ఠి 18 వ తేదీన జరిగింది.

గోష్ఠిలో ప్రసంగించిన పై ముగ్గురు వక్తలు భారతదేశం - జన చైనాల ఒడంబడిక ఒక దేశంపై ఆదేశ ప్రజలకుగల ప్రాదేశికహక్కులను, సర్వాంసహాధికారాన్ని గుర్తించడం, ఒక దేశవ్యవహారాలలో మరోదేశం జోక్యం కల్గించుకోకుండా వుండటం, ఒక దేశంపై మరోదేశం దురాక్రమణ చేయకుండా ఉండటం అనే ఉత్తమ ప్రజాస్వామిక సూత్రాల ప్రాతిపదికగా జరిగిందనీ, యీ సూత్రాలనే గనుక ప్రపంచంలోని అన్ని దేశాలూ గౌరవించితే ప్రపంచ సమస్యలు శాంతియుతంగా పరిష్కారం కాగలవని అన్నారు.

వారి ప్రసంగాలలో యింకా యీ క్రింది విషయాలు తెలియజేశారు: ఆసియాకు గుండెకాయగా వున్న టిబెట్టుపై దురాక్రమణ చేయాలని సామ్రాజ్యవాదులు ప్రయత్నిస్తూ వచ్చారు. 1904 లో టిబెట్టు రాజధాని అయిన లాసాపై దండయాత్ర జరిపి కొన్ని ముఖ్యమైన హక్కులు సంపాదించిన బ్రిటీషు సామ్రాజ్యవాదులు కూడ టిబెట్టుపై చైనాకుగల హక్కును తోసిపుచ్చలేదు.

8వ శతాబ్దంనుండి టిబెట్టు చైనాలో అంతర్భాగంగా ఉంటూవచ్చింది. గత నలభై సంవత్సరాలలోను అంతఃకలహాలవల్ల టిబెట్టుపై చైనా అధికారం కొంతబలహీనపడింది! ఇప్పుడుచైనాలో బలవత్తరమైన ప్రజాప్రభుత్వం యేర్పడి టిబెట్టు ప్రజల ఆమోదంతో టిబెట్టుపై అధికారాన్ని పునఃప్రతిష్ఠాపన చేసింది. ఇందులో దురాక్రమణ యేమీ లేదు.

చెఫూ ఒడంబడిక

కలకత్తా విశ్వవిద్యాలయంలో చైనా చరిత్ర అధ్యాపకులైన ప్రొఫెసర్ త్రిపురారి చక్రవర్తి చైనాపై చేయబడుతున్న ఆరోపణలను ఖండించుతూ యిలా ప్రసంగించారు:

1876లో జరిగిన చెఫూ ఒడంబడిక ప్రకారం బ్రిటిషు సామ్రాజ్యవాదులు ప్రథమంగా టిబెట్టులో కొన్ని ప్రత్యేక హక్కులను సంపాదించారు. పదిసంవత్సరాలుగడిచాక చైనాప్రభుత్వం ఈహక్కులను వదులుకోవలసిందిగ బ్రిటిష్ ప్రభుత్వాన్ని కోరగా, అప్పుడే బర్మాను జయించిన ఉత్సాహంలోవున్న బ్రిటీషు ప్రభుత్వంతనకుగల హక్కులను వదలుకున్నది.

1886 లో జరిగిన మెక్ మేయర్ కన్వెన్షనులో చెఫూ ఒడంబడిక రద్దు చేయబడింది. 1901 లో భారతదేశ గవర్నరుజనరలుగా పని చేసిన లార్డు కర్జను టిబెట్టును ఆక్రమించుకోడానికి అనుమతి యివ్వమని బ్రిటీషు ప్రభుత్వాన్ని కోరాడు.

అప్పుడు ఇండియా సెక్రటరీ కర్జనును తొందరపడవద్దని, వళ్ళుదగ్గరపెట్టుకుని ప్రవర్తించాలని కర్జనుకు సమాధానమిచ్చాడు. టిబెట్టుపై చైనాకు సర్వాంసహాధికారం ఉన్నదనేవిషయం అంతర్జాతీయంగా అంగీకరించబడ్డ విషయమనీ, అందువల్ల తొందరపాటు చర్య అంతర్జాతీయంగా చిక్కులకు దారితీయ గలదని ఇండియా సెక్రటరీ తెలియజేశాడు.

అయితే 1904లో బ్రిటిషుసామ్రాజ్యవాదులు లాసాపైదండయాత్రచేసి టిబెట్టులో తిరిగి కొన్ని ప్రత్యేక హక్కులు సంపాదించుకున్నారు. ఈ హక్కులు 1953 వరకు ఉండేవి. 1907 లో జరిగిన ఆంగ్లో - రష్యను కన్వెన్షనులో సామ్రాజ్యవాదులు టిబెట్టు చైనాలో అంతర్భాగమనే చారిత్రిక సత్యాన్ని అంగీకరించారు.

టిబెట్టులో అమెరికా కుట్రలు

ప్రొఫెసర్ హీరేన్ ముఖర్జీ ప్రసంగించుతూ టిబెట్టుపై తమకు రాజకీయంగాగాని, ఆర్థికంగా గాని హక్కులు ఉన్నాయని భారత ప్రజ లెప్పుడూ చెప్పలేదనీ, అలాంటప్పుడు బ్రిటిషు సామ్రాజ్యవాద దురాక్రమణదారులు చైనా బలహీనతను కనిపెట్టి దాడిచేసి సాధించుకున్న హక్కులు మనకు వారసత్వంగా రావాలని మనం కోరడంలో అర్థం లేదనీ అన్నారు.

టిబెట్టులో అమెరికా ఏజెంట్ల కుట్రలను గూర్చి వార్తలు వస్తున్నాయని, కొంతమంది విదేశీ నిపుణులు ఒక 'సైన్యాన్ని' కూడ యేర్పాటు చేస్తున్నారనీ అన్నారు. మరికొందరు టిబెట్టును స్వతంత్రదేశంగా గుర్తించమని ఐక్యరాజ్యసమితికి విజ్ఞప్తి చేశారని చెప్పారు. కాని ఒక నెలక్రితం దలైలామా, పంచన్లామాలుకలసి టిబెట్టుకు చైనా ప్రజాసైన్యాలు వచ్చిన రోజు గొప్ప సుదినంగా పరిగణిస్తున్నామని, ఆ రోజు టిబెట్టు ప్రజల జీవితంలో మరువరాని దినమని పెకింగుకు పంపిన సంయుక్త సందేశంలో తెలియజేశారని అన్నారు. చైనాప్రజాసైన్యాల ప్రవేశం టిబెట్టు ప్రజలకు భద్రతను, సౌఖ్యాన్ని చేకూర్చాయని ఆ సందేశంలో తెలియజేశారు.

'టిబెట్టు దినోత్సవం' జరపాలని ప్రయత్నించిన కొందరు 'అమెరికన్ భక్తుల' -చర్యలను విమర్శించుతూ, టిబెట్టును శాశ్వతంగా కోల్పోయామని తెలిసినావ సామ్రాజ్యవాదులు, యుద్ధోన్మాదులు టిబెట్టులో తమ కుట్రలను మానుకోలేదని హెచ్చరించారు. భారతదేశం-నేపాల్ సరిహద్దు ప్రాంతంలో అమెరికన్ ఏజెంట్లు పుట్టలుపుట్టలుగా వున్నారు. 'నేషనల్ జియోగ్రాఫిక్ మేగజైన్' అనే అమెరికా పత్రిక టిబెట్టుకు వెళ్ళే మార్గాలు, టిబెట్టులో విమానాలు దిగడానికి అనువైన ప్రదేశాలను చూపించే పటాలను ప్రచురించిందని ముఖర్జీ తెలియజేశారు.

ప్రొఫెసర్ చక్రవర్తి మాట్లాడుతూ భారతదేశానికి చైనాకు 1800 మైళ్ళ పొడువు గల సరిహద్దు వున్నదనీ, సుఖప్రదమైన జీవన వ్యవస్థను నిర్మించుకుంటున్న చైనా ప్రజలు మనతో స్నేహపాత్రంగా గాక వేరే విధంగా వుండబోరనీ అన్నారు. భారతదేశానికి చైనా సరిహద్దున వుండటం భారతదేశానికి ఒక రక్షణ అనీ, టిబెట్టుగనుక అమెరికా ఆధీనంలో వుండి, పాకిస్తాన్ వలె యుద్ధ కేంద్రంగా మార్చబడితే ఎటువంటి ప్రమాద మేర్పడేదో ఆలోచించమని కోరారు.

ముఖాముఖి చర్చలద్వారా శాంతిసాధన

స్టాక్హోమ్ సభలో కొత్త నినాదం

స్టాక్హోమ్, జూన్ 20

అంతర్జాతీయ ఉద్రిక్తతను సడలించడానికై ఇచట జరుగుతున్న ప్రపంచ మహాసభకు 250 మంది ప్రతినిధులు వచ్చారు.

చైనానుండి ఉపప్రధాని కోమోజో, బ్రిటన్ నుండి శాంతి కాంగ్రెస్ కార్యదర్శులలో ఒకరైన డంకన్ జోన్స్, భారతదేశంనుంచి రామేశ్వరీ నెహ్రూ తదితరశాంతి ఉద్యమనాయకులు, మాస్కోనుండి బిషప్ నికొలస్, ఇల్యా ఎహెరన్బర్గ్ మొదలైనవారు వచ్చారు.

1950 లో శాంతి మహాసభ జరిగిన "పౌరభవనం" లో ఈ సమావేశం కూడా జరిగింది.

ప్రపంచశాంతిసమితి స్వీడిష్ శాఖలో ప్రముఖుడూ, కమ్యూనిస్టూ అయిన అంటన్ స్ట్రాండ్ ఈసభ ఏర్పాట్లను చూశాడు.

"ముఖాముఖి చర్చలు" అనే నినాదాన్ని స్టాక్హోమ్ సభ ఈయగలదని తెలుస్తుంది.

ప్రపంచమంతటా చిన్న చిన్న సమావేశాలు జరిపి, వివిధ వృత్తులకు జాతులకు చెందిన వారిని ఆహ్వానించి, అంతర్జాతీయ సుహృద్భావం పెంపొందించడానికి "ముఖాముఖి చర్చలు" కొనసాగించడానికే ఈ సభ పథకం వేస్తుంది.

ఎనిమిదిమంది జపాను ప్రతినిధులు నిన్న మాస్కోనుండి ఇచటికి వచ్చారు. వీరికి జపాను ప్యాస్పోర్టులు లేకపోయినా స్వీడన్ అనుమతించిందట.

ఇవాళ సమావేశ అనంతరం ప్రకటించబడిన వార్తలో భారత ప్రతినిధి రామేశ్వరి నెహ్రూ, ఇండో చైనా సమస్యపై ఇలా అన్నట్లు తెలియ వచ్చింది.

"ఇండోచైనా యుద్ధంపట్ల మా ప్రభుత్వ వైఖరి సుస్పష్టంగా ఇదివరకే తెలియజేయబడింది. జెనీవా సభలో మేం చేసిన స్వల్ప ప్రయత్నాలు ఈ సమస్యాపరిష్కారానికి చాలవరకు సహాయపడ్డాయని భావించుతున్నాం."

పారిస్ యూనివర్సిటీలోని 'లా' అధ్యాపకుడు రనీ కేపిటా ఈ సభకు అధ్యక్షత వహించాడు.

మరో నూతనయుద్ధం, విధ్వంసం తప్పాలంటే, ఇండోచైనాలో శాంతి అవసరం అని నెమ్మదిగానైనా ఫ్రాన్సు గ్రహించిందని ఈయన అన్నాడు.

కమ్యూనిస్టుపార్టీకి విరాళం

వివాహ సందర్భంలో

గుడివాడ, జూన్ 21

గుడివాడతాలూకా జొన్నపాడు వాస్తవ్యులు శ్రీ మల్లిరెడ్డి భాస్కరరెడ్డిగారు తన కుమార్తె వివాహసందర్భంలో వధూవరుల తరఫున కమ్యూనిస్టుపార్టీకి పది రూపాయలు విరాళమిచ్చారు.

పేదలు సాగుకు తెచ్చిన బంజరు భూములు

///

ధనికులు, భూస్వాముల మధ్య పంపిణీ

తమకు న్యాయం కలుగజేయాలని పసలదీవి గ్రామ ప్రజల ఆందోళన

లింగనబోయినచెర్ల, జూన్ 19

పేదలు సాగుకు తెచ్చిన బంజరుభూములు ధనికులు, భూస్వాములు పంచుకున్నందుకు అసమ్మతి తెలుపుతూ నర్సాపురం తాలూకా పసలదీవి గ్రామ ప్రజానీకం ఆందోళన చేస్తున్నారు.

పశ్చిమ గోదావరిజిల్లా నర్సాపురం తాలూకా లింగనబోయినచెర్ల శివారు పసలదీవి గ్రామంలోనున్న 500 ఎకరాల బంజరుభూమిని సుమారు పది సంవత్సరాలనుండి మాజీ సైనికులు, పరిసర గ్రామాల పేద ప్రజానీకం ఆక్రమించుకొని సాగుకు తెచ్చారు.

కాని ధనిక రైతులు గ్రామ పెత్తందార్లు స్థానికంగానున్న వ్యవసాయ కూలీలను వెళ్ళగొట్టి పరాయివారి నందని భూములనుండి తొలగించి గతసంవత్సరం గ్రామ సమిష్టిక్రింద భూమినంతను సాగుచేసారు. ధాన్యం మాత్రం పంపకం చేయలేదు.

భూమి పంచాలని పేదలందరూ వత్తిడి చేయగా భూస్వాములు, పెత్తందార్లు చేరి దేవునికి కొంత భూమి, దేవతకు కొంతభూమి, గ్రామ కరణం, మునసబులకు తదితర పెద్దలకు కొన్ని వాటాలుపోగా మిగిలిన 30 ఎకరాలు మాత్రం పేదరైతు-కూలీలకు ఒక్కొక్కరికి 10 సెంట్లు చొప్పున పంచియిచ్చారు.

ఆంధ్రా అసెంబ్లీలో ఆమోదించబడిన తీర్మానంప్రకారం బంజరుభూములు భూమిలేని పేదకూలీ-రైతులకు పంపకం చేయాలి.

కాని పసలదీవి గ్రామానికి చెందిన 500 ఎకరాల బంజరుభూమిని దేవుళ్లకు, దేవతలకు, భూస్వాములకు వాటాలు వేసి పంచడం సాగనివ్వరాదని ఆ గ్రామ పేదరైతులు, కూలీలు ఆందోళన సాగిస్తున్నారు. పై పంపకాలను రద్దుచేయాలని కోరుతూ పై అధికార్లకు మహజర్లు పంపించారు.

దగ్గుంట గ్రామంలో సాగుకు లాయకైన బంజరు భూములు

పేదలకు పంచాలని ఆందోళన

రాపూరు, జూన్ 20

నెల్లూరుజిల్లా రాపూరు తాలూకా దగ్గుంట, రామాపురం, కొనగలూరు, రాజుపాళెం గ్రామాలకు చెందిన బంజరు భూమి 450 ఎకరాలు వున్నది. అందులో 200 ఎకరాలు సాగుకులాయకైన భూమి వుంది.

ఆ భూమిని సాగుచేసుకొనేందుకు ఆ గ్రామాల పేద ప్రజానీకం సుమారు 150 కుటుంబాలవారు ఆ గ్రామాల పెద్దలను, రైతులను అభ్యర్థించారు. అందుకు అందరు అంగీకరించారు. కాని రాజుపాళెం రైతులు కొద్దిమంది మాత్రం వ్యతిరేకించారు.

ఈ బంజరు భూములనుగురించి పై అధికార్లు వెంటనే విచారణ జరిపి భూమిలేని పేద రైతు కూలీలకు పంచాలని ఆ పరిసర గ్రామాల ప్రజానీకం ఆందోళనసాగిస్తున్నారు. (వి.వి.)

కర్నూలు, జూన్ 22

ఆంధ్ర ప్రణాళికా మంత్రి శ్రీ దామోదరం సంజీవయ్యగారు ఈ నెల 25 వ తేదీన విజయవాడకు వస్తున్నారు. ఆయన విజయవాడనుంచి బందరుకూడా వెళతారు.

స్థలం చూపకుండా పేదకూలీల యిండ్లు పీకివేసిన ఉదంతం

నెల్లూరులో

నెల్లూరు, జూన్ 20

నెల్లూరులో డైకాస్‌రోడ్డు ప్రక్కన గవర్నమెంటు బంజరుభూమిలో ఆరేండ్లక్రితం కొంతమంది నిరుపేద ముస్లింలు యిండ్లుకట్టుకొని కాపురముంటున్నారు. ఈ విధంగా 15 కుటుంబాలవారు యిక్కడ యిళ్ళుకట్టుకున్నారు. వీరిలో కొంతమంది బీడీ కార్మికులు. తక్కినవారు యితరకూలీలు. వీరికింకే విధమైన జీవనాధారంలేదు. ఈ పేదలు అక్కడ యిళ్ళు కట్టుకున్న రెండున్నర సంవత్సరాలకు ప్రభుత్వం ఆ స్థలాన్ని సీంధను పుచ్చుకొన్న తాలూకా ఆఫీసు ఫ్యూనులు యిద్దరికి పట్టాలకిచ్చింది. అప్పటినుండి యిప్పటివరకు వాళ్ళకూ వీళ్ళకూ తగాదాజరుగుతూనేవుంది. ఈకూలీలు మునిసిపలు పన్నులు చెల్లిస్తూనేవున్నారు. తాము ముందుగా అక్కడ యిళ్ళుకట్టుకున్నామనీ, తమ కింకే జీవనాధారంలేదనీ, ఆ స్థలం పట్టాలకు తీసుకున్న యిరువురికీ ఆస్తి పాస్తులూ యిళ్ళూ వున్నాయనీ, అయినా ప్రభుత్వం తమకింకెక్కడయినా స్థలం చూపించితే అక్కడకుపోయి యిళ్లు కట్టుకుంటామనీ ప్రభుత్వ అధికార్లవద్దకు రెండేండ్ల నుండి తిరుగుతున్నారు. కాని ప్రభుత్వం తమ మంకుపట్టు విడువలేదు. అకస్మాత్తుగా మొన్నటిదినం యిండ్లవద్ద మగవారెవరు లేని సమయంలో పై యిద్దరూ పోలీసు బలగంతో వచ్చి ఆడవాండ్లు ముసలి ముతకా గోలపెడుతున్నా వినిపించుకోక ఎనిమిదిండ్లు పీకి పారవేశారు. ఇండ్లలో వున్న కుండా చట్టీ, పెట్టే, మంచం అన్నీ వీధిలోకి పారేశారు. తాటాకులన్నీ కుప్పవేసారు. అక్కడ పోలీసులుమకాం పెట్టించారు. ఈ దారుణకృత్యంచూచి ప్రభుత్వాన్ని దుయ్యబట్టని వారులేరు. కనీసం ఇంకొక చోటు అయినా చూపించకుండాహఠాత్తుగా యింతమందిని ఎండకూ వానకూ గురిచేసినందుకు ప్రతివారూ నిరసన తెల్పుతున్నారు.

హరిజనులకు ఇండ్ల స్థలాలు

మంత్రి సంజీవయ్యగారి వివరణ

కర్నూలు, జూన్ 22

ఆంధ్ర హరిజనశాఖామంత్రి శ్రీ డి. సంజీవయ్యగారు ఈదినం ఇచ్చట మాట్లాడుతూ ఈఆర్థిక సంవత్సరం ముగియకముందే హరిజనుల ఇండ్లస్థలాల కోసం, బడ్జెటులో అవకాశం కల్పించబడిన 13 లక్షల, 60 వేలరూపాయలు వినియోగించడానికి ప్రయత్నిస్తున్నామని తెలియజేశారు.

వ్యవసాయ సంస్కరణ లంటేనే మన ప్రభుత్వానికి భయం. గట్టెక్కి 7 సంవత్సరాలైనా చేద్దాం, చూద్దాం అంటున్నారు.

"మేము 3 సంవత్సరాలలో భూమి సంస్కరణలను విజయవంతంగా నిర్వహించాం" అని సగర్వంగా చైనా దేశీయులు చాటుకుంటున్నారు. వారి సంస్కరణలకు ప్రాతిపదికయైన

నవచైనా వ్యవసాయ సంస్కరణ

(చట్టం - వర్గీకరణ)

77 పేజీలు ఆనే పుస్తకం చదవండి వెల 0—10—0

ప్రతులకు: (పోస్టేజి అదనం)

విశాలాంధ్ర ప్రచురణాలయం

బకింగుహాంపేట పోస్టు, విజయవాడ-2

పుల్లేటికుర్రు వ్యవసాయ కూలీలకు ఇండ్లస్థలాలు

మంజూరుచేయాలని అభ్యర్థన

కడలి, జూన్ 19

తూర్పుగోదావరి జిల్లా శాసనసభ్యులు శ్రీ గంజి నాగేశ్వరరావుగారు యిలా వ్రాస్తున్నారు.

తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట తాలూకా పుల్లేటికుర్రు గ్రామ శివార్లు మాకెట్టువారిపేట, చీకట్లవారిపేట, కొల్లివారి పేట, కోటవారిపేట, మల్లివారిపేట, చినలంకలలో నివసించు హరిజనులు తదితర వ్యవసాయ కూలీలు ఇండ్ల స్థలాలు లేక యమయాతనలు పడుతూన్నారు. వీరు సంక్షేమ శాఖవారికి, జిల్లా కలెక్టరుకు గత సంవత్సరం మహజర్లు పెట్టుకొనియున్నారు కూడా. దానిపై ప్రభుత్వము దర్యాప్తు చేయడం జరిగింది.

చినలంక వ్యవసాయకూలీలు తమకు యిండ్ల స్థలాలు యిప్పించవలసినదిగా సుమారు యేడెనిమిది సంవత్సరాలనుండి ఆందోళనచేస్తున్నారు. 1951 లో కొత్తపేట డిప్యూటీ తహసీల్దారుగారు చినలంక వ్యవసాయకూలీల ఇండ్లకు స్థలం ఎక్వయిర్ చేయడానికి ఆర్డరు వచ్చిందని తెలియజేసారు. కాని నేటి వరకు స్థలం ఎక్వయిర్ చేయడం జరుగలేదు.

పై శివార్లలో నివసించే హరిజనులు, వ్యవసాయ కూలీలు ఒక్కొక్కపాకలో రెండుమూడు కుటుంబాలు నివసిస్తూ అతి నికృష్టమైన జీవితాలు గడుపుతున్నారు. ప్రభుత్వం వెంటనే పుల్లేటికుర్రు శివార్లలో నివసించే హరిజనులకు తదితర వ్యవసాయ కూలీలకు ఇండ్ల స్థలాలు ఎక్వయిర్ చేసి వారి యిబ్బందులను తొలగించాలని హరిజనాభ్యుదయ మంత్రిగారిని కోరుతున్నాను.

పాక్ - అమెరికా సైనిక సంధికి నిరసన

పర్లాకిమిడీ తాలూకా కమ్యూనిస్టు కమిటీ తీర్మానం

పర్లాకిమిడి, జూన్ 20

పాక్-అమెరికా సైనిక సంధిని నిరసిస్తూ, తూర్పు బెంగాల్‌లో ఇటీవల జరిగిన అరెస్టులను ఖండిస్తూ ఈ నెల 14, 15 తేదీలలో రాచూరులో జరిగిన గంజాంజిల్లా పర్లాకిమిడి తాలూకా కమ్యూనిస్టుకమిటీ విస్తృత సమావేశంలో తీర్మానించబడింది.

ఫ్రాన్సు, పోర్చుగీసు ప్రభుత్వాలు ఇండియాలో తమకున్న స్థావరాలను విడచిపెట్టి పోవాలనీ, బ్రిటిష్ కామన్వెల్తునుండి ఇండియా పూర్తిగా వైదొలగాలనీ మరో రెండు తీర్మానాలు చేశారు.

ఆటం, హైడ్రోజను బాంబులను తక్షణం నిషేధించాలని కోరారు.

శ్రీ దాట్ల రాయపరాజుగారు తాలూకా కమిటీకార్యదర్శిగా ఎన్నికోబడ్డారు. పార్టీ రాజకీయ పాఠశాలలు నడపాలని సమావేశంలో నిశ్చయించబడింది.

విశాఖపట్నంలో చిత్రకళా ప్రదర్శనం

గవర్నర్ శ్రీ త్రివేదిచే ప్రారంభం

విశాఖపట్నం, జూన్ 20

విశాఖ చిత్రకళా పరిషత్ ఆధ్వర్యాన ప్రథమచిత్రకళా ప్రదర్శనం నేటి ఉదయం టౌన్‌హాలులో ప్రారంభమైంది. ప్రదర్శనానికి ఆంధ్ర గవర్నర్ శ్రీ సి. యం. త్రివేదీ అధ్యక్షత వహించారు.

పరిషత్ తరపున గవర్నర్‌గారికి సమర్పించిన మెమొరాండంలో ఆంధ్ర దేశంలోని చేతిపనులు, లలిత కళలు సంపూర్ణ వికాసం పొందేట్లు చూడవలసిందనీ, అందుకు ఒక ఆర్టుగ్యాలరీ నిర్మించి, దాని ఉపయోగార్థం ఒక గ్రంథాలయాన్ని, ఒకపాఠశాలను నెలకొల్పాలని అభ్యర్థించబడింది. శ్రీ త్రివేది ప్రసంగిస్తూ మన చిత్రకారులు పేదవారవటంచేత యిట్టి ప్రదర్శనలవలననే ప్రజల సన్నిహితత్వం, ఆదరణ పొందవలసి ఉంటుందని అన్నారు. తరువాత శ్రీ త్రివేది చిత్రకళా ప్రదర్శనను ప్రారంభించారు.

ఆంధ్ర చిత్రకారులు అనేకమంది ఈ ప్రదర్శనకు తమ చిత్రాలను పంపారు. ఈ ప్రదర్శనలో ఉత్తమ చిత్రానికి బంగారు పతకం యిచ్చుటకు శ్రీ త్రివేది రు. 150/- లు యిచ్చారు.

విజయవాడ గాంధీనగరు హైస్కూలులో ఈ నెల 20 వ తేదీ సాయంకాలం హిందీ పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు యోగ్యతాపత్ర ప్రదానం చేయబడింది.

గుంటూరులో తంతి టెలిఫోను సౌకర్యాలు

కర్నూలు, జూన్ 22

గుంటూరులో జూలై 5 నుంచి ప్రత్యేకంగా హైకోర్టు నెలకొంటుంది కాబట్టి, తంతి తపాలాశాఖాధికారులు అక్కడ తంతి, టెలిఫోన్ సౌకర్యాలను పెంపు చేయాలని సంకల్పించారు.

గుంటూరు మద్రాసుల మధ్య ఒక టెలిప్రింటర్ లైను, గుంటూరుకర్నూలుల మధ్య టెలిగ్రాఫ్ లైను వేయదలచుకున్నారు.

కర్నూలు, గుంటూరుల మధ్య టెలిప్రింటరు లైను వేసే ఉద్దేశ్యం ప్రస్తుతానికి లేదు. హైకోర్టు ఆవరణలో చిన్న టెలిఫోను ఎక్చేంజి కార్యాలయం నెలకొల్పుతారు. హైకోర్టుకు చెందిన వివిధ శాఖల ఫోనులను ఈ కార్యాలయం చూస్తుంది.

రైతుల స్థితిగతులు తెలిపే నమూనా సర్వే

ఆంధ్రలో 200 గ్రామాలలో

కర్నూలు, జూన్ 22

భారతదేశంలో కొనసాగించబడుతున్న నమూనా సర్వేలో భాగంగా ఆంధ్ర ప్రాంతంలోకూడా రెండువందల గ్రామాలు ప్రత్యేకించి సర్వే చేయబడతాయి. యీ సర్వే జూలై మాసం మధ్యనుండి ప్రారంభమవుతుంది.

ఈసర్వే నిర్వహణకు కేంద్రప్రభుత్వ సిబ్బందిగాక ఆంధ్రప్రభుత్వం కొందరిని నియమిస్తుంది. ఆంధ్రప్రభుత్వం నియమించే సిబ్బంది 130 గ్రామాలలోను, కేంద్ర సిబ్బంది మిగిలిన గ్రామాలలోను యీ సర్వేపని నిర్వహిస్తారు. ఇది 5 మాసాలలో పూర్తిచేయబడుతుంది.

రైతులు ఎవరెవరు ఎంత భూమి కలిగివున్నది, వారి పశుసంపద, వినియోగించే వ్యవసాయ పరికరాలు మొదలగు వివరాలు తెలిసికొనేందుకుగాను భారత దేశమంతటా యీ సర్వే చేయబడుతూంది.

తూర్పు బెంగాల్‌లో 1066 అరెస్టులు

కేసుల పునఃపరిశీలన జరుగుచుందని ప్రభుత్వ ప్రకటన

ఢాకా, జూన్ 22

తూర్పు బెంగాల్ లోని హక్ మంత్రివర్గం రద్దయింతర్వాత, యింతవరకూ 1066 అరెస్టులు జరిగాయి. ఇందులో 883 అరెస్టులు బెంగాల్ ప్రజారక్షణ చట్టం పేరిట జరిగాయి. మిగతా అరెస్టులు పాకిస్తాన్ పీనల్ కోడ్‌లోని అనేక సెక్షన్ల పేరిట జరిగాయి.

ఇకముందుకూడా ప్రజా భద్రతకు భంగకరంగా ప్రవర్తించేవారిని గాని, ప్రవర్తిస్తారని అనుమానంవున్నవారిని గాని అరెస్టుచేయటం సాగుతూనే వుంటుందనీ, ఐతే ఇంతవరకూ అరెస్టు చేయబడినవారి కేసుల్ని పునఃపరిశీలించి నిరపరాధులుగా తేలిన వారిని విడుదలచేయటంకూడా జరుగుతుందని తూర్పు బెంగాల్‌లోని గవర్నర్ ప్రభుత్వం ఈవేళ ఒక ప్రకటనచేసింది.

ప. పంజాబ్‌లోకూడ ఐక్యసంఘటన స్థాపన

పంజాబ్ జిన్నా అవామీలీగ్ ప్రయత్నాలు

లాహోర్, జూన్ 21

రాష్ట్రంలోని వివిధ ప్రతిపక్షాలతో కలిసి 'యునైటెడ్ ఫ్రంట్' ను స్థాపించేందుకు గల అవకాశాలను గురించి ఆలోచించేందుకని, పంజాబ్ జిన్నా అవామీలీగ్ ఒక కమిటీని వేసింది.

ఈ 'యునైటెడ్ ఫ్రంట్' ఏర్పడగానే, రాష్ట్రంలో రానున్న 7 ఉపఎన్నికలలోనూ ముస్లింలీగ్ పక్షానికి పోటీగా, యునైటెడ్ ఫ్రంట్ అభ్యర్థులు నిలబడతారట.

తూర్పుబెంగాల్‌లో గవర్నర్ పరిపాలనను విధించటాన్నీ, రాజకీయ నాయకుల అరెస్టులనూ నిరసిస్తూ, తూర్పు బెంగాల్‌లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని ఏర్పరచవలసిందిగా కోరుతూ పంజాబ్ జిన్నా అవామీలీగ్ కార్యవర్గం ఒక తీర్మానం చేసింది.

నవచైనా రాజ్యాంగం

(2 వ పేజీ తరువాయి)

పెట్టుబడిదారులు చట్టం ప్రకారం ఉత్పత్తి సాధనాలపైన, ఇతర ఆస్తిపైన యాజమాన్యం కలిగివుండే హక్కును ప్రభుత్వం కాపాడుతుంది. పెట్టుబడిదారీపరిశ్రమలను, పెట్టుబడిదారీ వ్యాపారాన్ని వినియోగించుకుంటూ పరిమితం చేస్తూ మార్పు చేయడమే ప్రభుత్వ విధానం. ప్రభుత్వ పరిపాలనా సంస్థలు విధించే కంట్రోలు పద్ధతిద్వారాను, ప్రభుత్వ యాజమాన్యంగల సంస్థల నాయకత్వంద్వారాను, కార్మికుల అజమాయిషీ ద్వారాను పెట్టుబడిదారీ పరిశ్రమల్లోను వ్యాపారంలోను జాతీయ శ్రేయస్సుకూ ప్రజలజీవితాభివృద్ధికీ ఉపయోగపడే లక్షణాలను ప్రభుత్వం వినియోగించుకొంటుంది. తద్విరుద్ధమైన లక్షణాలను పరిమితం చేస్తుంది. పెట్టుబడిదారీ పరిశ్రమలు, వ్యాపారం ప్రభుత్వ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో వివిధ రూపాలలో పరిణామం చెందడానికి, క్రమక్రమంగా పెట్టుబడిదారీ యాజమాన్యం స్థానే ప్రజలందరి యాజమాన్యం ఏర్పడ్డానికి ప్రభుత్వం ప్రోత్సాహమిస్తుంది; మార్గం చూపుతుంది. పెట్టుబడిదారులు చట్టవ్యతిరేక పద్ధతుల ద్వారా ప్రజాశ్రేయస్సుకు భంగం కలిగించరాదని, సామాజిక ఆర్థిక వ్యవస్థను పాడుచేయరాదని, జాతీయ ఆర్థిక ప్రణాళికను విచ్ఛిన్నం చేయరాదని ప్రభుత్వం శాసిస్తూంది. పౌరులందరూ చట్టం ప్రకారం సొంత ఆదాయాలపైన, నిల్వ చేసుకున్న ధనంపైన, ఇండ్లపైన, జీవనాధారాలపైన యాజమాన్యం కలిగివుండే హక్కు ప్రభుత్వంచే రక్షింపబడుతుంది.

పౌరుల వారసత్వ హక్కును ప్రభుత్వం చట్టంద్వారా రక్షిస్తుంది.

ప్రజల శ్రేయస్సుకై ప్రభుత్వం చట్టనిబంధనలకు లోబడి పట్టణాలలోని, గ్రామసీమల్లోని భూమిని, ఇతర ఉత్పత్తి సాధనాలను కొనడానికిగాని, నష్టపరిహారమిచ్చి స్వాధీనం చేసుకోవడానికి గాని, ఎట్టిపరిహారం ఇవ్వకుండా స్వాధీనం చేసుకోవడానికి గాని హక్కు కలిగి వుంటుంది.

ఏ వ్యక్తియైనా తన సొంత ఆస్తిని ప్రజాక్షేమాన్ని భగ్నం చేయడానికి ఉపయోగిస్తాంటే, ప్రభుత్వం అలా చేయకుండా ఆంక్ష విధించవచ్చు.

ఆర్థిక ప్రణాళిక

ప్రభుత్వం ఉత్పత్తిశక్తుల్ని నిర్విరామంగా పెంపొందించేటందుకు ఆర్థిక ప్రణాళికద్వారా జాతీయ ఆర్థిక విధానాన్ని అభివృద్ధి చేస్తూ మార్పులు తీసుకువస్తుంది. తద్వారా ప్రజల ఆర్థిక సాంస్కృతిక జీవనాన్ని వృద్ధిచేస్తుంది. దేశ స్వాతంత్ర్యాన్ని, భద్రతను దృఢతరం చేస్తుంది.

చైనా ప్రజారిపబ్లిక్కులో శక్తి సామర్థ్యాలుగల ప్రతి పౌరుడు ఏదో ఒక వృత్తి చేసుకోవడం గౌరవంగా పరిగణించబడుతుంది. పౌరులు తమ తమ వృత్తులలో ప్రదర్శించే చొరవను, సృజనాత్మక శక్తిని ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది.

ప్రభుత్వ సంస్థల విధులు

ప్రభుత్వ సంస్థలన్నీ ప్రజలమీద ఆధారపడి పనిచేయాలి. వారితో నిత్య సంబంధాలుంచుకోవాలి. వారి అభిప్రాయాలను గౌరవించాలి. వారి అజమాయిషీని అంగీకరించాలి.

ప్రభుత్వ సంస్థలలో పనిచేసే వారంతా నూతన ప్రజాతంత్ర విధానానికి బద్ధులై వుండాలి. రాజ్యాంగ చట్టాన్ని, శాసనాలను అమలు జరపాలి. ప్రజలకు సహాయం చేయడానికి ప్రయత్నించాలి.

చైనా ప్రజా రిపబ్లిక్కు నూతన ప్రజాస్వామ్య విధానాన్ని కాపాడుతుంది. ప్రజల హక్కులను, భద్రతను రక్షిస్తుంది. దేశద్రోహుల్ని, విప్లవ ప్రతిఘాతకుల్ని శిక్షిస్తుంది. ప్రభుత్వం చట్టనిబంధనలకు లోబడి ఫ్యూడల్ భూస్వాముల, గుత్త పెట్టుబడి దారుల రాజకీయ హక్కులను కొంత నిర్ణీతకాలం వరకూ రద్దుచేస్తుంది. అదే సమయంలో ఇతర పౌరుల మాదిరిగానే వారు కూడ కష్టార్జితం మీద జీవించేందుకు మార్గాలు చూపుతుంది.

చైనాప్రజారిపబ్లిక్ యొక్క సాయుధ బలాలన్నీ ప్రజలవి. ఈ సాయుధ బలాలు ప్రజా విప్లవంయొక్క, జాతీయ ఆర్థిక వ్యవస్థయొక్క విజయాలను కాపాడాలి. దేశ భద్రతను, భూభాగాన్ని, స్వాతంత్ర్యాన్ని రక్షించాలి. ఇవి వారి విధ్యుక్త ధర్మాలు.

(సశేషం)

అనంతపురంజిల్లా ప్రాథమికోపాధ్యాయుల జీతాల సమస్య

వెంటనే పరిష్కరించాలని శాసనసభ్యుని విజ్ఞప్తి

పెనుకొండ, జూన్ 18

అనంతపురం జిల్లాలోని ప్రాథమికోపాధ్యాయులకు వెంటనే జీతాలు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ పెనుకొండ శాసనసభ్యుడు శ్రీ టి. లక్ష్మీనారాయణరెడ్డిగారు యీ దిగువ ప్రకటన చేశారు.

"అనంతపురం జిల్లా ఎలిమెంటరీ ఉపాధ్యాయులకు ఏప్రిల్ నెల నుంచీ జీతాలు యివ్వడం లేదు. ఎన్నిసార్లు యీ విషయమై ప్రభుత్వదృష్టికి తెచ్చినను ప్రభుత్వం యీ సమస్యను పరిష్కరించ లేకపోవుచున్నవి.

ఉపాధ్యాయులు తిండికిలేకుండా పనిచేయడం సాధ్యంకాని పని. పిల్లలకు విద్యరాదని ఉపాధ్యాయులను నిందించి ప్రయోజనమేమి?

సాధ్యమైనంత త్వరలో ఉపాధ్యాయులజీతాల సమస్యను పరిష్కరించి, ఉపాధ్యాయులకు నెలజీతాలు సరిగా ముట్టునట్లు చర్య తీసుకోవలెనని ప్రభుత్వాన్ని కోరుచున్నాను."

ఉపాధ్యాయుల బోధనానుభవం

జీతాల హెచ్చింపుసందర్భంలో పరిగణించాలని విజ్ఞప్తి

శిరువెళ్ల, జూన్ 21

ప్రాథమికోపాధ్యాయులకు జీతాలు హెచ్చించే సందర్భంలో వారి బోధనానుభవాన్ని పరిగణనలోనికి తీసుకొనడం ఎంతైనా అవసరమని విజ్ఞప్తిచేస్తూ కర్నూలు జిల్లా ప్రాథమికోపాధ్యాయ సంఘం అధ్యక్షులు శ్రీ కె. సి. వీరన్నగారు ఈ దిగువ ప్రకటన చేశారు.

"ప్రాథమిక విద్యా విచారణకమిటీ సిఫారసుల మేరకు ఆంధ్ర ప్రభుత్వము ప్రాథమికోపాధ్యాయుల జీతముల హెచ్చింపు విషయమై త్వరలో ఒక నిర్ణయానికి వచ్చునని విద్యాశాఖ డైరెక్టరు పత్రికా ప్రకటన ద్వారా తెలియుచున్నది.

విచారణకమిటీవారు ఉపాధ్యాయుల సర్వీసు విషయములో, 5 సంవత్సరముల సర్వీసుకు ఒక ఇంక్రిమెంటు చొప్పున 4 ఇంక్రిమెంట్లకు మించకుండ జీతాలు యివ్వవలయునని సిఫారసు చేసినట్లు తెలియుచున్నది, ఇదిచాలఅన్యాయము' ఇది సర్వీసుగల ఉపాధ్యాయులను పూర్తిగా నిరుత్సాహపరచడమే కాగలదు. వెనుక 1947 సంవత్సరములో జీతాల సవరణ జరిగినప్పుడు కూడ కొత్త, పాత అంతా ఒకటేరై సర్వీసు కలిగిన ఉపాధ్యాయులను ఉత్సాహరహితులనుచేసినది. ఈనాడు కూడ ప్రభుత్వము తిరిగి అదే ప్రకారం చేయబోవుచున్నది. సర్వీసుగల ఉపాధ్యాయులకే సంసార భారములు అధికమై, వారికే ఎక్కువ జీవనభృతి అవసరము కాగలదు.

అటువంటి పరిస్థితులలో 12 సంవత్సరముల పైబడిన సర్వీసు అంతయు ఆర్థికసహాకారమున కేమాత్రం వుపయోగించక నిరర్థకమగును.

సర్వీసుతో నిమిత్తములేకుండ యిప్పుడు పొందుచున్న జీతమునకు ప్రతి ఉపాధ్యాయునికి రు 5/-ల చొప్పున చేర్చినచో విచారణ కమిటీ ఆదేశం ప్రకారం ప్రతిఉపాధ్యాయుడు రు 25/-ల ప్రారంభజీతంపొందినట్లున్నూ, సర్వీసు కలిగిన ఉపాధ్యాయులు తమ సర్వీసుకు ప్రతిఫలం పొందినట్లున్నూ కాగలదు.

కాన అనుభవజ్ఞులైన విద్యాశాఖ డైరక్టరును, విద్యాశాఖా మాత్యులును దీర్ఘంగా ఆలోచించి క్రొత్త విద్యావిధానానికి ఉపాధ్యాయు లెల్లరు శక్తివంచనలేని సహకార మిచ్చుటకు తగునైన ఆర్థికసహాకారం కలిగించెదరని ఆశించుచున్నాను."

నౌకా ఆయుధాగారం పనివారల సంఘం ఎన్నికలు

విశాఖపట్నంలో

విశాఖపట్నం, జూన్ 20

విశాఖపట్నంలోని ఇండియన్ నేవల్ ఆర్మామెంటు డిపో సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ ఐదవ వార్షికోత్సవం నిన్న జరిగింది. నూతన సంవత్సర కార్యవర్గానికి అధ్యక్షులుగా శ్రీ బుద్ధిరాజు మల్లిఖార్జునరావుగారు, ఉపాధ్యక్షులుగా శ్రీ కె. సత్తెయ్య, కార్యదర్శిగా శ్రీ యస్. అప్పలనాయుడు, ఇంకా యిద్దరు సహాయ కార్యదర్శులు, కోశాధికారులు ఎన్నికోబడ్డారు.

రేడియో

జూన్ 25 శుక్రవారం

విజయవాడ: (357.1 మీటర్లలో) ఉదయము:
6-55 స్వాగతము;
7-0 (తె. వా);
7-15 మద్రాసువలె
8-0 (ఆం. వా);
4-0 గానసుధ;
1-0 మద్రాసు వలె;
1-30 గీతావళి;
1-40 (హిం. వా);
1-50 (తె. వా);
6-15 ప్రాంతీయవార్తలు
6-30 గ్రామసీమ;
7-0 (తె. వా);
7-15 గ్రామసీమ;
7-30 భరత దీక్ష-నాటిక రచన: వింజమూరి శివరామారావు;
7-45 కూచిపూడి నాట్య సంపద: అభినయము - నటరాజ్ రామకృష్ణ ప్రసంగం;
8-30 వయొలిన్;
9-0 (ఆం. వా);
9-15 వాద్యబృందము;
9-30 సమాప్తి.

మద్రాస్(బి): (270.8 మీటర్లలో) ఉదయము:
6-55 స్వాగతము;
7-0 (తె. వా);
7-15 ఉదయగానము;
7-30 మద్రాసు ఎ వలె;
12-0 కార్మికులకు;
1-0 గీతమాలిక;
1-30 (ఆం. వా);
1-40 గానమంజరి;
1-50 (తె. వా);
2-0 వయొలిన్;
6-15 ప్రాంతీయవార్తలు
6-25 లలితగీతము;
6-30 గ్రామసీమ;
7-0 (తె. వా);
7-15 గ్రామసీమ;
7-45 మద్రాసు ఎ వలె;
9-30 ఎమ్. ఎస్. రామారావు;
9-50 శాస్త్రీయసంగీతం;
10-30 సమాప్తి.

హైద్రాబాద్: (411.0 మీటర్లలో) ఉదయము:
6-55 సుప్రభాత్;
7-0 (తె. వా);
7-15 ఉదయగానం;
8-0 (ఆం. వా);
8-15 (హిం. వా);
12-30 మంగళ్ గాన్;
12-50 (ఉ. వా);
1-0 భజనే;
1-10 ఆరాధన;
1-50 (తె. వా);
5-30 సితార్;
5-45 భజనే;
6-0 మ. కార్యక్రమం;
6-30 హేమంతకుమార్;
6-40 స్థానిక ప్రకటనలు;
6-45 గ్రామసీమ;
7-0 (తె. వా);
7-15 గ్రామసీమ;
7-45 (క. వా);
8-15 గీతావళి;
9-0 (ఆం. వా);
9-15 (ఉ. వా);
9-30 సితార్;
10 30 సమాప్తి.

కల్లుగీత కార్మికులు ఐక్యంగా పోరాడితేనే విజయం సాధ్యం

నెల్లూరు గీత కార్మిక సంఘ కార్యకర్తల హెచ్చరిక: అన్ని పక్షాలవారిని జిల్లా మహాసభకు ఆహ్వానించాలని తీర్మానం

కోవూరు, జూన్ 20

ఒకేసమస్యపై ఒకే ఆశయంగల వృత్తిదారులు ఒకే తాటిపై నిలబడినపుడే విజయం పొందగల్గుతారు. ఏకాకిగ ఏ పార్టీగాని, ఏ సంస్థగాని ఇటువంటి ముఖ్య సమస్యపై దూరదృష్టి లేకుండా ఒంటెత్తుగా ఉద్యమం లేవదీసి కార్మికులను తికమకల పాల్జేయుట హానికరం" అని నెల్లూరుజిల్లా కల్లుగీత కార్మికసంఘ కార్యకర్తలు ఇచట సమావేశమై ఒక తీర్మానం చేశారు.

సమావేశం ఈనెల 16 వ తేదీన తాలూకా రైతుసంఘ కార్యాలయంలో జరిగింది. సమావేశానికి జిల్లాలో పలు చోట్లనుండి కార్యకర్తలు వచ్చారు.

నెల్లూరుజిల్లా కల్లుగీతకార్మికసంఘ మహాసభ నెల్లూరులో జరుపుటకు సమావేశంవారు నిశ్చయించారు.

కల్లుగీత కార్మికోద్యమాన్ని ఐక్యం చేయుటకు వీలుగ ఈ జిల్లామహాసభకు కల్లుగీత కార్మిక సంఘాలలో వివిధ పక్షాలవారిని ఆహ్వానించాలని కూడా నిర్ణయించారు.

శ్రీ గాతు లచ్చన్న, అంకెం వెంకటపతి, (కార్యాచరణ సంఘం) శ్రీ మురాల లక్ష్మీపతి, శ్రీ ఎస్. ఆర్. దాట్ల (కల్లుగీత కార్మిక సంఘం) మొదలైన వారిని మహాసభకు ఆహ్వానించుటకు నిర్ణయించారు.

రామమూర్తి కమిటీ సూచనలగురించిన అసెంబ్లీ తీర్మానం అమలు జేయుటకు ప్రభుత్వం నిరాకరించుచున్నందుకు సమావేశంవారు నిరసించారు.

నర్సాపురం తాలూకాలో పలుచోట్ల సభలు

పశ్చిమ గోదావరిజిల్లా నర్సాపురం తాలూకా తుందుర్రులో ఈనెల మొదటి వారంలో శ్రీ కొట్టు సుబ్బారావుగారి అధ్యక్షతను బహిరంగసభ జరిగింది. తాలూకా కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి శ్రీ అల్లూరి సత్యనారాయణరాజు మాట్లాడుతూ రామమూర్తి కమిటీ సూచనల గురించి అసెంబ్లీ తీర్మానాన్ని ఆమోదించినప్పటికీ ప్రభుత్వం అమలు జరుపనందుకు తీవ్రంగా విమర్శించారు.

మల్లవరంలో శ్రీ వి. సత్యనారాయణగారి అధ్యక్షతను జరిగిన మరొక సభలో శాసనసభ్యులు శ్రీ భూపతిరాజు లక్ష్మీనరసింహరాజు, పడాల శ్యామసుందరరావు గారలు మాట్లాడుతూ రామమూర్తి కమిటీ సూచనలను అమలు జరుపవలసిందని అసెంబ్లీ తీర్మానించినప్పటికీ ప్రభుత్వం ఆ విధంగా చేయనందుకు విమర్శించారు. బంజర్లు యిండ్లస్థలాల సమస్యలలో ప్రజలు ఐక్యతతో పోరాడి సాధించుకోవాలని ఉద్బోధించారు.

కల్లుగీత పనివారి ప్రత్యక్ష చర్య

షెడ్యూల్డుకాస్టు ఫెడరేషను మద్దతు

విజయవాడ, జూన్ 20

రామమూర్తి కమిటీ సిఫార్సులను ప్రభుత్వం వెంటనే అమలుజరుపని పక్షంలో మాజీ కల్లుగీత పనివారితో సహా సత్యాగ్రహంలో పాల్గొనవలసిందని అన్ని జిల్లాలలోని ఫెడరేషన్ వారిని కోరుతూ రాష్ట్ర షెడ్యూల్డుకాస్టు ఫెడరేషన్ కార్యవర్గంవారు తీర్మానించారు.

సమావేశం 15 వ తేదీన విజయవాడలో శ్రీ మోసెస్‌గారి అధ్యక్షతను జరిగింది.

కొంపేరు బంజరు భూముల విషయంలో సమావేశంవారు ఈ దిగువ తీర్మానం చేశారు.

కొంపేరు బంజరు భూముల పంపకంలో ఆంధ్ర ప్రభుత్వం అవలంబించిన విధానానికి ఆమోదం తెలుపుతూ కర్షక వృత్తియే జీవనోపాధిగా గలిగి భూస్థితిలేని నిరుపేద షెడ్యూల్డు కులాలవారికి భూముల పంచే విషయం పరిశీలించుటకు పదకొండుమంది సభ్యులుగల ఒక రాష్ట్ర కమిటీని నియమిస్తూ, శ్రీ యస్. వేమయ్య యం. యల్. ఏ. గారిని చెయిర్మన్‌గాను శ్రీ ఆర్. అంద్రెయ, ఉపాధ్యక్షులుగాను నిర్ణయించారు.

తూర్పు జర్మనీకి అణు ఫిరంగులు

ఫ్రాంక్‌ఫర్టు, జూన్ 22

తూర్పు జర్మనీలోని మెక్లెన్ బర్గ్ రాష్ట్రానికి సోవియటు యూనియను నుంచి బ్రహ్మాండమైన అణుఫిరంగి పంపబడిందని ఫ్రాంక్‌ఫర్టర్ న్యూప్రెస్సీ పత్రిక వ్రాసింది.

తూర్పు జర్మనీలో సోవియట్లు తొమ్మిది అణుఫిరంగులను పెట్టదలచారనీ, వానిలో యిది మొట్టమొదటిదనీ ఆ పత్రిక వ్రాస్తూంది. దీనితోపాటు ఆధునికమైన శతఘ్నిదళం ఒకటి ప్రత్యేక రైలులో వచ్చాయి.

అమెరికనులు తయారు చేసిన అణు ఫిరంగి కన్న ఇది చాలా శక్తివంతమని ఆ పత్రిక వ్రాస్తూంది.

అమెరికను ఫిరంగి బరువు 85 టన్నులు. సోవియటు ఫిరంగి బరువు 110 టన్నులు.

అమెరికను ఫిరంగినుంచి 20 మైళ్ళ దూరంవరకు కాల్చవచ్చును. కాని సోవియటు ఫిరంగి 28 మైళ్ళదూరం కాల్చగలదని తెలుస్తూంది.

గతసంవత్సరం ఆకురాలు కాలంలో అమెరికనులు ఒక అణుఫిరంగిదళాన్ని పశ్చిమ జర్మనీకి పంపారు. మరో ఆరు ఫిరంగుల్ని పంపుతున్నామని ఈఏడాది ఫిబ్రవరిలో అమెరికా ప్రకటించింది.

ఫ్రెంచి కీలక స్థానం వియత్మిన్‌ల వశం

హాంగ్ కాంగ్, జూన్ 2.

హనోయికి 80 మైళ్ళ వాయవ్యంగా వున్న వియత్రీ అనే కీలక స్థానాన్ని వియత్మిన్ సైన్యాలు జూన్ 16 వ తేదీన ఆక్రమించాయనీ, అక్కడి ఫ్రెంచి దళాలు పారిపోయాయనీ వియత్మిన్ రేడియో ప్రకటించింది.

చివోవ్ అనే నగరాన్ని ముట్టడిస్తున్న వియత్మిన్ సేనలు వెనక్కి తరిమివేశాయని ఫ్రెంచి అధికార వర్గాలు ప్రకటించాయి.

బజారు ధరలు

విజయవాడ, జూన్ 23

(మధ్యాహ్నం గం.1-0)

బంగారం ధరలు

	రూ.	అ.	పై
మేలిమి : తులా	84	4	0
వరాసా	83	0	0
నవరసు	57	12	0
వెండి : 100 తులములు	152	0	0
1 తులము	1	9	6

ధాన్యం ధరలు

	రూ.	అ.	పై
24 నెంబరు	22	0	0
కంకసన్నాలు	19	8	0
12 నెంబరు	19	0	0
అక్కుళ్ళు	18	12	0
మసూరు	18	8	0
గోదామణి	18	8	0

బియ్యం ధరలు

	రూ.	అ.	పై
24 నెంబరు	54	0	0
కంకసన్నాలు	46	0	0
12 నెంబరు	45	0	0
అక్కుళ్ళు	44	8	0
మసూరు	44	0	0
గోదామణి	44	0	0

అపరాల ధరలు

	రూ.	అ.	పై
మినుములు 240 శే	41	8	0
కందులు	21	0	0
నల్లపెసలు (మాగాని) 28/-	32	0	0
పచ్చపెసలు 280 శే	29	0	0
పచ్చపెసలు (మెట్టవి) 30/-	32	0	0
శెనగలు	33	0	0
ధనియాలు 90 సేరులు	26	0	0
ఉలవలు 26/-	27	0	0
ఆముదాలు	30	0	0
పంచదార (ఉయ్యూరు)	85	8	0
బెల్లం మణుగు	6	0	0
మిర్చి	22	0	0

వేరుశనగ ధరలు

	రూ.	అ.	పై
వేరుశనగపప్పు 177 సేరులు	54	0	0
,, కాయ మణుగు	14	0	0
,, నూనె 160 సేరులు	16	6	0
,, చెక్కపిండి 160 ,,	19	4	0
కొబ్బరికాయ॥1000 అమలాపురం	150	0	0
,, ముక్తేశ్వరం	160	0	0
పాలకొల్లువి ,,	145	0	0
కొబ్బరినూనె డబ్బా	29	0	0
వెల్లుల్లి మణుగు	3	8	0
నీరుల్లిపాయలు మ॥	1	9	0

నేడే చూడండి
బసంత్ పిక్చర్సువారి
ఆలీబాబా 40 దొంగలు
(గేవాకలర్ నృత్యములతో)



దర్శకత్వము : హోమీవాడియా
షకీలా, మహీపాల్
నేటినుండి ఈ దిగువ కేంద్రాలలో
విజయవాడ .... శ్రీ మారుతి
గుంటూరు .... శ్రీ సరస్వతి
విశాఖపట్టణం .... శ్రీ సరస్వతి
కాకినాడ .... [illegible]
25-6-54 నుండి
రాజమండ్రి .... శ్రీ కృష్ణా
గుడ్విన్ రిలీజు

వాషింగ్టన్ సమావేశంపై కామన్సుసభలో చర్చలు

అత్యవసర సమస్యలనన్నిటినీ చర్చిస్తామని చర్చిల్ ప్రకటన

లండన్, జూన్ 22

త్వరలోనే వాషింగ్టన్‌లో జరుగనున్న ఐసెన్‌హోవర్-చర్చిల్ సమావేశాన్నిగురించి ఈనాటి బ్రిటిష్ కామన్సుసభలో చర్చలు జరిగాయి. "ఈసమావేశానికి నిర్ణీతమైన ఎజండా అంటూ లేదు; కాని అత్యవసర విషయాల్ని గురించి ఒకరి అభిప్రాయాల నొకరం తెలిసికొనేందుకు అవకాశం ఉంది" అని బ్రిటిష్ ప్రధాని చర్చిల్, ఒక లేబరుపక్ష సభ్యుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పాడు.

ఈసమావేశంలో పశ్చిమ జర్మనీ కోర్కెలుగూడా చర్చకు రావచ్చును. యూరోపియన్ సంరక్షణసంధి ఏర్పడే వరకూ, ఆక్రమిత పశ్చిమజర్మనీ సమస్యను వాయిదా వేయటం తగదనిగూడా అనుకుంటూన్నట్లు తెలుస్తూంది.

బ్రిటిష్‌ప్రధాని చర్చిల్, బ్రిటిష్ విదేశాంగమంత్రి ఈడెన్‌లు కలిసి గురువారంనాడు సాయంత్రం వాషింగ్టన్‌కు బయల్దేరతారట. తర్వాత, కెనడా ప్రధాని, లూయీలాసెంట్ ఆహ్వానంమీద అట్టావాకుగూడా వెళ్తారని తెలుస్తూంది.

ఆటం ఆయుధాలపై చర్చలు

చర్చిల్, ఈడెన్‌లతోపాటు లార్డ్ చెర్వెల్ కూడా వాషింగ్టన్‌కూ, అట్టావాకూ కూడా వెళ్తాడట. చెర్వెల్ బ్రిటిషు ప్రభుత్వానికి అణుసమస్యలపై ముఖ్య సలహాదారుగా పనిచేస్తున్నాడు. కాబట్టి, ఈ సమావేశంలో అణుఆయుధాల కంట్రోలును గురించి కూడా చర్చ జరుగుతుందని భావించవచ్చును. అలాగే ఆగ్నేయాసియా సంరక్షణను గురించికూడా తప్పక చర్చలు జరుగుతాయని భావించబడుతూంది.

ఈసమావేశాన్ని గురించి కామన్సుసభలో వచ్చిన ప్రశ్నలకు సమాధానమిస్తూ బ్రిటిష్ ప్రధాని చర్చిల్ యిలా అన్నాడు :

"ఈ సమావేశానికొక నిర్ణీతమైన ఎజండాఅంటూలేదు. కాని, అత్యవసర సమస్యలన్నిటిని గురించీ ఒకరి అభిప్రాయాల నొకరం తప్పక తెలుసుకోవటం జరుగుతుంది."

లేబర్‌పక్ష సభ్యుడు, విలియంవార్బీ మాట్లాడుతూ "ఈ సమావేశాన్ని గురించి అమెరికన్ విదేశాంగ మంత్రి జాన్ ఫాస్టర్ డల్లెస్ పొరపాటుగా అభిప్రాయపడినట్లు కన్పిస్తోంది. జెనీవా సమావేశం విఫలమైందని భావించటం చేత మీరీ సమావేశానికి వెళ్ళటంలేదనే విషయాన్ని మీరు ఖచ్చితంగా చెప్పాలి" అని చర్చిల్‌తో అన్నాడు.

దీనికి సమాధానం చెబుతూ "ఈ సమావేశం జరిగితే బాగుంటుందనే వుద్దేశాన్ని నేను ఏప్రిల్ మాసంలోనే అమెరికా అధ్యక్షుడికి తెలియజేశాను. అప్పటికింకా జెనీవా సమావేశం ప్రారంభంకూడాకాలేదు." అని చర్చిల్ అన్నాడు.

ఈనాటి కామన్సుసభలో విదేశాంగ మంత్రి ఈడెన్ జెనీవా సమావేశాన్ని గురించి రేఖామాత్రంగా మాట్లాడాడు. జెనీవా సమావేశాన్ని గురించిన ముఖ్య ప్రకటనను ఈడెన్ రేపటి సభలో చేస్తాడని తెలుస్తోంది.

వాషింగ్టన్ సమావేశానికి వెళ్ళేప్పుడు చర్చిల్, ఈడెన్‌లతోపాటు మరో 20 మంది ముఖ్య వుద్యోగులు కూడా వెళ్తారట.

బ్రిటిష్ ప్రధానీ, విదేశాంగ మంత్రీ అట్టావాకు జూన్ 29 న వెళ్తారనీ, బ్రిటిష్ ప్రధాని అక్కడి రేడియోలో ప్రసంగిస్తాడనీ, విదేశాంగ మంత్రి ఈడెన్ అట్టావా టెలివిజన్ ప్రోగ్రాంలో పాల్గొంటాడని కూడా తెలుస్తోంది.

సింహళ ప్రధానితో భారత ప్రభుత్వ ప్రతినిధి చర్చలు

కొలంబో, జూన్ 22

భారత సంతతికి చెందిన సింహళీయుల గురించి సింహళ ప్రభుత్వం చేయబోతూన్న రాజ్యాంగ సంస్కరణల పట్ల భారతదేశాభిప్రాయాన్ని వివరించే పత్రాలను, సింహళంలోని భారత ప్రభుత్వ ప్రతినిధి, శ్రీ సి. సి. దేశాయి ఈవేళ సింహళ ప్రభుత్వానికి అందజేశారు.

ఇదే సమస్యపైన శ్రీ సి.సి. దేశాయి సింహళ ప్రధాన మంత్రి జాన్ కొటెలవాలాతో చర్చలు జరుపుతారని కూడ తెలుస్తోంది.

ఆయుధ విసర్జన సమావేశ వైఫల్యం

అయిదురాజ్యాల సమావేశం ముగింపు

లండన్, జూన్ 22

మే 13 వ తేదీనుంచి ఆయుధ విసర్జనసమస్యపై జరుగుతున్న అయిదు రాజ్యాల రహస్యసమావేశం విఫలమై నేడు ముగిసింది.

ఈ సమావేశం నిన్న సాయంకాలం ఆఖరు పర్యాయం జరిగింది. దీనికి బ్రిటన్‌లోని సోవియటు రాయబారి జాకోబ్ మాలిక్ అధ్యక్షతవహించాడు.

అణ్వాయుధాలను, ఇతర ఆయుధాలను తగ్గించే విషయంలో ఏకాభిప్రాయం కుదరలేదని ఐ. రా. స. నియమించిన ఆయుధ విసర్జన సంఘానికి తయారుచేసిన రిపోర్టును ఈ సమావేశంలో ఆమోదించారు. గురువారం ఆ రిపోర్టును ప్రకటిస్తారు.

తిరువాన్కూర్ ప్రభుత్వంరవాణా శాఖ నుంచి 30 మంది బస్సు కార్మికులను తొలగించింది.

యుద్ధవిరమణ సంఘంలో ఇండోనేషియాకు స్థానం

తొమ్మిది రాజ్యాల రహస్యసమావేశంలో సోవియటు ప్రతినిధి ప్రతిపాదన

జెనీవా, జూన్ 22

ఇండోచైనాలో యుద్ధవిరమణ పర్యవేక్షణకై నియమించబడే నాలుగురాజ్యాల సంఘంలో ఇండోనేషియాను కూడా చేర్చడానికి అంగీకరిస్తామని నేడు సోవియటు ప్రతినిధి నోవికోవ్ తొమ్మిదిరాజ్యాల రహస్య సమావేశంలో ప్రతిపాదించాడు.

ఇండోచైనా సమస్యా పరిష్కారానికై జెనీవాలో తొమ్మిది రాజ్యాల రహస్యసమావేశం పదిహేడో పర్యాయం నేడు జరిగింది. సోవియటు ప్రతినిధివర్గ తాత్కాలిక నాయకుడు నోవికోవ్ అధ్యక్షత వహించారు.

బ్రిటన్, సోవియట్, అమెరికా ప్రతినిధివర్గనాయకులు తమ తమ దేశాలకు వెళ్ళిపోయారు. ఫ్రెంచి ప్రధాని, విదేశాంగమంత్రి అయిన మెండేఫ్రాన్సు ఇంకా జెనీవాకు రాలేదు. ఇండియా ప్రయాణ సన్నాహాలలో చైనా ప్రధాన మంత్రి చౌ ఎన్‌లై నేటి సమావేశానికి రాలేదు.

వియత్మిన్ ఉపప్రధాని ఫామ్‌వాన్ డాంగ్ సమావేశానికి వచ్చాడు.

యుద్ధ విరమణ నిబంధనల పర్యవేక్షణ సంఘం సమస్యను పరిశీలించేటందుకై సాంకేతిక సంఘాన్ని నియమించాలని ఫ్రెంచి ప్రతినిధి సభలో సూచించాడు.

తొమ్మిది రాజ్యాల సమావేశం కొనసాగడానికి అంగీకరింపబడింది గనక, మరల ఈ సాంకేతిక సంఘం అనవసరం అని సోవియటు ప్రతినిధి నోవికోవ్ నిరాకరించాడు.

ఫ్రెంచి ప్రతినిధివర్గ తాత్కాలిక నాయకుడు జీన్‌చావెల్ ఈ సమావేశంలో నియమింపబడే తటస్థ రాజ్య సంఘం లావోస్, కంబోడియాల యుద్ధ విరమణ సమస్యలను కూడా పరిశీలించాలని చెప్పాడు.

యుద్ధరంగాలలో యుద్ధ విరమణ నిబంధనలను అమలుపరిచే "సంయుక్త కమిటీల పనిపైన తటస్థరాజ్య సంఘానికి పెత్తనం వుండాలిసిందేనని రెండు సంఘాలు విడివిడిగా సంపూర్ణ బాధ్యతతో పనిచెయ్యడం [illegible] రాదని అమెరికా ప్రతినిధివర్గ తాత్కాలిక [illegible]

ఈ వాదాన్ని బ్రిటిష్ ప్రతినిధివర్గ తాత్కాలిక నాయకుడు లార్డు రీడింగ్ కూడ సమర్థించాడని తెలుస్తూంది.

సోవియట్ ప్రతినిధి నోవికోవ్ ఆ సూచనను వ్యతిరేకించాడు.

యుద్ధ విరమణ పర్యవేక్షక సంఘం చేతిలో సైన్యాలుంచుతే తప్ప, సంయుక్త కమిటీలను ఆ సంఘం ఆధీనంలో వుంచడంలో అర్థం లేదనీ, పర్యవేక్షక సంఘం అధీనంలో సైన్యాలను పెట్టడానికి తాము అంగీకరించమనీ నోవికోవ్ అన్నాడు.

బ్రిటిష్ ప్రతినిధివర్గ తాత్కాలిక నాయకుడు లార్డు రీడింగ్ కొలంబో రాజ్యాలయిదూ (ఇండియా, పాకిస్తాన్ సింహళం, బర్మా, ఇండోనీషియా) యుద్ధ విరమణ పర్యవేక్షక సంఘంగా ఏర్పడాలని ప్రతిపాదించాడు.

అధ్యక్షుడు నోవికోవ్ పర్యవేక్షక సంఘ నిర్మాణం విషయంలో తమ ప్రతిపాదనలు పునరుద్ఘాటిస్తూ నేడు ఇంకొక సూచనచేశారు.

మొట్టమొదట సూచించిన ఇండియా, పాకిస్తాన్, పోలెండ్, జెకోస్లొవేకియాలతో కూడిన పర్యవేక్షక సంఘంలో ఇండోనేషియాను కూడా అయిదోదిగా చేర్చుకోడానికి తాము అంగీకరిస్తామన్నాడు. లేదా ఇండియా, ఇండోనేషియా, పోలెండులతో మూడు రాజ్యాల సంఘానికి వొప్పుకోమన్నాడు.

చర్చలు తేలకుండానే సమావేశం ముగిసింది. మరునటి సమావేశం గురువారంనాడు జరుగుతుంది.

భార్యాభర్తలు పరస్పర సమ్మతిపై విడాకులుపుచ్చుకోవచ్చునని ప్రత్యేక వివాహాల బిల్లులోవున్న అంశాన్ని తొలగించాలని అఖిల భారత మహిళా మహాసభ స్థాయి సంఘం వారు తీర్మానించారు.

భారత - చైనా ప్రధానులు జరిపే సమాలోచనలు

ఆసియా వ్యవహారాలపై అధిక ప్రభావం కల్గియుండ గలవని జెనీవా వర్గాల వ్యాఖ్య

జెనీవా, జూన్ 22

ఈ వారంలో భారత - చైనా ప్రధానమంత్రుల మధ్య ఢిల్లీలో జరుగబోతున్న సంప్రతింపులు ఉభయదేశాల సంబంధాలపైనేగాక యావత్తు ఆసియా వ్యవహారాలపై అత్యధికమైన ప్రభావాన్ని కలిగి ఉండగలవని ఇక్కడ రాజకీయ వర్గాల్లో భావిస్తున్నారు.

ఆసియాలోని రెండు పెద్దరాజ్యాల ప్రధాన మంత్రులైన చౌ - ఎన్ - లై నెహ్రూలు కలుసుకోవడం ఇదే మొదటి సారి. భారతదేశం చైనాప్రజారిపబ్లిక్కును 1949 జనవరి మాసంలో బ్రిటన్, పాకిస్తాన్, సింహళ దేశాలతోపాటు గుర్తించింది. అప్పటినుండీ ఐక్యరాజ్య సమితిలో జనచైనాకు సభ్యత్వం ఇవ్వాలని ఇండియా ఆందోళన చేస్తూ వస్తోంది.

త్వరలోనే వాషింగ్‌టన్‌లో అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్, బ్రిటిషు ప్రధాని చర్చిల్ సమావేశం కాబోతున్నారు. ఈ సమావేశానికి కొద్దిరోజుల ముందుగానే చౌ-ఎన్-లై నెహ్రూలు కలుసుకొంటున్నారనీ ఆవిధంగా దీనికి మరింత ప్రాముఖ్యత కలదని ఇక్కడ రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానించుతున్నారు.

వాషింగ్‌టన్ సమావేశానికి ముందు ఢిల్లీ సమావేశం

జెనీవాలో కొరియా సమస్యపై 19 రాజ్యాల సమావేశం విఫలమైన తరువాత, ఏడు వారాలుగా ఇండోచైనాలో శాంతిస్థాపనకు జరుగుతున్న సంప్రతింపుల అనంతరం అటు వాషింగ్‌టన్‌లోనూ ఇటు ఢిల్లీలోనూ జరుగుతున్న ఈముఖ్యసమావేశాల్లో దాదాపు ఒకేరకమైన సమస్యలపై చర్చ జరుగవచ్చునని అభిజ్ఞవర్గాలు వూహించుతున్నాయి.

చర్చలు ప్రధానంగా ఈ క్రింది సమస్యలపై జరుగవచ్చునని ఇక్కడ రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి :

(1) కొరియా సంప్రతింపుల వైఫల్యం; కొరియాసమస్య విషయంలో ఇండియా అత్యంత శ్రద్ధ తీసుకొన్నది. 1953 జూలైలో ఏర్పడిన యుద్ధ విరమణ ఒడంబడిక ఫలితంగా ఏర్పడిన తటస్థ రాజ్యాల సంఘానికి ఇండియా అధ్యక్షురాలుగా పనిచేసింది. (2) ఇండోచైనాలో శాంతి స్థాపనకోసం జరుగుతున్న తొమ్మిది రాజ్యాల సమావేశ సంప్రతింపులు సరళి. గత ఏడు సంవత్సరాలుగా సాగుతున్న ఇండోచైనా యుద్ధాన్ని అంతం చేయడానికి, ఫ్రాన్స్-పశ్చిమ రాజ్యాలమధ్య సామరస్యాన్ని కుదర్చడానికి భారత ప్రతినిధి ఇక్కడ మూడు వారాలుగా ఉండి కృషి చేస్తున్నాడు. కృష్ణమీనన్ జెనీవాలో చౌ-ఎన్-లైను తొమ్మిది సార్లు కలుసుకొని మాట్లాడారు. ఉభయుల మధ్య సంప్రతింపులు ఒక్కొక్కసారి మూడు గంటలవరకూ జరిగిన ఘటనలున్నాయి. చైనా ప్రధాన మంత్రితో తాను జరిపిన సంప్రతింపుల ఫలితాలను గురించి ఎప్పటికప్పుడు వివరంగా శ్రీ కృష్ణమీనన్ నెహ్రూకు పంపించారు.

3. ఆసియాలో భారత - చైనాలు పెద్దరాజ్యాలు గాబట్టి ఆగ్నేయాసియాలోని పరిస్థితులన్నింటినీ చౌ-ఎన్-లై, నెహ్రూలు చర్చించుతారు.

జెనీవాలో ఆసియా రాజ్యాల తరఫున చైనా పాత్ర

ప్రధానంగా ఉన్న ఈ సమస్యలేగాక చైనా, ఇండియాల మధ్యగల వాణిజ్య సాంస్కృతిక సంబంధాలను గురించి వారుభయులూ చర్చించుతారని అనుకొంటున్నారు.

జెనీవా సమావేశంలో ఇండియా, బర్మా, ఇండోనేసియా, పాకిస్తాన్ మొదలుగాగల ఆసియా దేశాలకు ప్రాతినిధ్యం ఉండాలని చైనా ప్రతినిధులు తమ సంప్రతింపుల సందర్భంలో కోరిన విషయం అందరికీ తెలిసిన సంగతే.

ఇండోచైనా యుద్ధవిరమణను పరిశీలించేందుకు ఇండియా, పాకిస్తాన్, జెకోస్లావేకియా, పోలెండ్‌లతో కూడిన ఒక అంతర్జాతీయ తటస్థ రాజ్యాల కమిషను నియమించాలని సోవియట్ యూనియన్ జెనీవా సమావేశంలో ప్రతిపాదించింది. ఈ [illegible] గట్టిగా బలపరచాయి. కాని ఈ ప్రతిపాదనను పశ్చిమ రాజ్యాలు నిరాకరించాయి. ఆ తరువాత ఇటీవలనే సోవియట్ రష్యా అనేక ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను చేసింది. వీటన్నింటిలోనూ ఇండియా ఆయా కమిషన్‌లకు అధ్యక్షురాలుగా ఉండాలనే కోరింది.

కాని పశ్చిమ రాజ్యాలు ఆ పరిశీలక సంఘంలో ఇండియా, పాకిస్తాన్, సింహళం, బర్మా, ఇండోనేషియాలు వుండాలని కోరాయి. ఈ విధంగా అయితే తమకు మెజారిటీ వోటువుండ గలదని భావించాయి.

చౌ - ఎన్ - లై - నెహ్రూలు తమ ఉభయ దేశాలకు సంబంధించిన ఉమ్మడి సమస్యలనేగాక అంతర్జాతీయ పరిస్థితుల నన్నింటినీ, ఫ్రాన్స్ - పశ్చిమ రాజ్యాల [illegible] చర్చించుతారని అనుకుంటున్నారు.

జెనీవా సమావేశంలో చైనా ప్రతినిధులు మాట్లాడుతూ ఆసియా దేశాలు పరస్పరం సంప్రతించుకోవాలని అనేక సార్లు సూచించారు.

ఇక్కడి చైనా ప్రతినిధులలో ఒకరు రాయటర్ విలేఖరితో మాట్లాడుతూ ఢిల్లీ సందర్శించవలసిందిగా నెహ్రూ పంపిన ఆహ్వానాన్ని చౌ- ఎన్- లై ఆమోదించాడనీ, ఉభయుల మధ్య సంప్రతింపులు "కొంతవరకు అధికారయుతంగా"నే ఉండగలవని తెలిపాడు.

చైనా ప్రధాన మంత్రితో ఇద్దరు సీనియర్ సలహాదార్లు వస్తానట.

అంతర్జాతీయ కార్మిక సంస్థలో సోవియటు ప్రతినిధులకు స్థానం

జెనీవా, జూన్ 22

అంతర్జాతీయ కార్మిక సంస్థలో సోవియటు రష్యా, బైలో రష్యా, యుక్రెయిన్, పోలెండ్, హంగేరీ, జెకోస్లొవేకియా, రుమేనియాల నుంచి వచ్చిన ప్రతినిధులకు స్థానం లేకుండా చేసేటందుకై అమెరికా చేసిన ప్రయత్నాలు విఫలమై, ఆ దేశాల ప్రతినిధులు సమావేశంలో పాల్గొనేటందుకై అవకాశం కలిగింపబడింది.

ఈ సంస్థకు ప్రతి దేశమునుంచీ పరిశ్రమ యజమానుల తరుపున కొందరూ, పరిశ్రమల కార్మికుల తరుపున కొందరూ ప్రతినిధులు పంపబడతారు.

పైన చెప్పిన దేశాలన్నింటా పరిశ్రమలను జాతీయం చేశారనే కారణంతో యజమానుల ప్రతినిధులను అంగీకరించరాదని పాశ్చాత్య రాజ్యాలు ఆటంకపరిచాయి.

కాని, అత్యధిక సంఖ్యాకులు ఆ ప్రతినిధులను రానివ్వడానికి అనుకూలంగా వోటు చేశారు. బ్రిటను, కామన్వెల్తు దేశాలు (ఒక్క పాకిస్తాన్ మినహాగా) సోవియటు వగైరా దేశాల యజమాన ప్రతినిధులను సమావేశాలలో పాల్గొననివ్వాలని వోటుచేశాయి.

దీనిపై వోటింగు జరిగినప్పుడు 105 మంది అనుకూలంగానూ, 79 మంది వ్యతిరేకంగానూ, 26 గురు తటస్థంగానూ వున్నారు.

తర్వాత సోవియటు, జెకోస్లొవేకియాలనుంచి వచ్చిన కార్మిక ప్రతినిధులను సభకు రానివ్వరాదని సామ్రాజ్యవాదుల చెప్పుచేతలలోవున్న "స్వతంత్ర ట్రేడ్‌యూనియన్ల అంతర్జాతీయ సమాఖ్య" ప్రతినిధులు వాదించారు.

కాని 93 వోట్లు అనుకూలంగానూ 83 వ్యతిరేకంగానూ వచ్చి ఆ దేశాల కార్మిక ప్రతినిధులను రానివ్వడానికి అంగీకరించారు.

జైలులో శిక్ష ననుభవిస్తున్న వారందరికీ నిర్బంధ వయోజన విద్యగరపాలని పశ్చిమ బెంగాలు ప్రభుత్వం నిశ్చయించింది.

◆ ◆ ◆

శ్యామాప్రసాద్ ముఖర్జీ ప్రథమ వర్ధంతి సభలు కలకత్తాలో జరిగాయి.

కమ్యూనిజంవ్యాప్తినుంచి జపానును రక్షించాలట

అమెరికా అధ్యక్షుని ఉపన్యాసం

వాషింగ్టన్, జూన్ 22

ఆసియాలో వ్యాపిస్తున్న కమ్యూనిజం జపానుకు పాకకుండా రక్షించవలసిన బాధ్యత అమెరికా మీద వుందని నేడు అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ అమెరికా పత్రికా సంపాదకుల సభలో అన్నాడు.

అమెరికాలోని 5200 వారపత్రికల సంపాదకుల సదస్సులో మాట్లాడుతూ ఐసెన్‌హోవరు ఇల్లా అన్నాడు :

"ఆగ్నేయాసియా, పసిఫిక్ ప్రాంతాలలో అమెరికా అవలంబిస్తున్న విధానానికి జపాను "స్వతంత్ర స్థితి"ని రక్షించడం అవసరం.

"ఆసియాలోని అఖండ సహజ సంపదలను క్రెమ్లిన్, చైనా పరిపాలకులుపయోగించుకొని, జపాను నౌకా బలాన్ని తోడు చేసుకోగలిగితే పసిఫిక్ సముద్రం కమ్యూనిస్టుల పెరటి బావి అయిపోతుంది.

"అందుచేత జపాను సోవియటు అధికారంలో పడకుండా చూడడం మనకెంతో ముఖ్యం."

పుదుచ్చేరి పోలీసుల అఘాయిత్యం

సత్యాగ్రహులపై హింసాకాండ

పుదుచ్చేరి, జూన్ 21

మొన్న పుదుచ్చేరిలో అరెస్టు చేసిన ఐదుమంది సత్యాగ్రహులలో నలుగుర్ని పోలీసులు నేడు విడిచిపెట్టారు.

ఈనలుగురూ పోలీసు నిర్బంధంలో 24 గంటలసేపు ఉన్నారు. ఈ 21 గంటల్లోనూ పోలీసులు సాగించిన హింసాకాండకు చిహ్నంగా వీరి శరీరం మీద బొబ్బలవాతలు కనిపిస్తున్నాయి.

పోలీసు నిర్బంధంలో తమకు అన్నపానాలు ఇవ్వలేదనీ, తెల్ల అధికారులు [illegible] ప్రవర్తించి కొట్టారని వీరు పత్రికలవారికి చెప్పారు.

[illegible]కత్వం వహించిన శ్రీ వెంకటేశన్‌ను పోలీసులు ఇంకా నిర్బంధంలోనేవుంచి తీవ్రంగా కొట్టారు. ఇప్పుడాయన కాలూ చేయీ కదపలేనిస్థితిలో వున్నారని తెలుస్తోంది.

ఫ్రెంచి విధానాలకు అడినోవర్ ఆక్షేపణ

డస్సెల్‌డార్ఫ్, జూన్ 20

పశ్చిమ జర్మనీ ఛాన్సెలర్ డాక్టర్ అడినోవర్ వెస్టుఫాలియా రాష్ట్ర ఎన్నికల సభలో ప్రసంగిస్తూ "సర్వస్వతంత్ర ప్రతిపత్తిని సాధించుకొనేటందుకెంతో కాలం జర్మనులు వేచి వుండబోర"న్నాడు.

ఆయనింకా ఇల్లా అన్నాడు :

"అమెరికా, బ్రిటన్‌లకు ఈ సంగతి తెలుసు. బహుశా ఫ్రాన్సు కూడా ఎరిగే వుంటుంది".

ఇండోచైనా సమస్యపైనా, యూరపురక్షణసంఘం సమస్యపైనా ఫ్రాన్సు అవలంబిస్తున్న విధానం పశ్చిమ జర్మనీకేగాక యూరపుకును, ప్రపంచానికికూడా వైదేశిక సంబంధాలలో చిక్కులు కల్పిస్తూందని అడినోవర్ ఆరోపించాడు.

దేశంలో కొన్ని అస్పత్రులలో అన్న చికిత్సాశాలలు నెలకొల్పాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నది.

◆ ◆ ◆

భారత రాజ్యాంగంలో ఏ విధమైన సవరణలను తలపెట్టవచ్చునని భారత వాణిజ్యమండలివారు కాంగ్రెసు అధి[illegible]

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మద్రాసు విద్యార్థులకు స్థానం

కర్నూలు, జూన్ 23

మద్రాసు విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులను సెకండ్ ఇయర్ ఫోర్త్ ఇయర్ తరగతులలో చేర్చుకొనడానికి ఆంధ్ర విశ్వవిద్యాలయము అంగీకరించింది. గుంటూరులో ఆంధ్ర హైకోర్టు స్థాపన మూలంగా ఈ పరిస్థితి ఏర్పడింది.

సాధారణంగా ఒకవిశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులను ఇతర విశ్వవిద్యాలయాలలో ఫస్టుఇయర్, థర్డ్ ఇయర్ తరగతుల్లోనే చేర్చుకొంటారు. కాని ఆంధ్ర హైకోర్టు మూలంగా మద్రాసునుంచి తరలివచ్చే కోర్టుఉద్యోగులు, లాయర్ల పిల్లల విద్యాభ్యాసం కోసం ఆంధ్ర విశ్వవిద్యాలయంవారు ఇప్పుడీ అవకాశం కల్పించారని ఆంధ్ర విద్యామంత్రి పట్టాభిరామారావుగారు అంటున్నారు. (వి. వి.)

చండీఘుర్, జూన్ 22

పంజాబు రాష్ట్రంలో భూమ్యాదాయాన్ని పునర్నిర్ణయించడానికి ప్రభుత్వం ఒక సంఘాన్ని నియమించింది. పంజాబ్ అభివృద్ధిశాఖామంత్రి సర్దార్ ప్రతాపసింగ్ కైరోన్ ఈ సంఘానికి అధ్యక్షులు. ఈ సంఘంలో మొత్తం 21 మంది సభ్యులున్నారు.

నగరంలో సినిమాలు

24—6—54

శ్రీ విజయ టాకీస్

గొప్ప ఇంగ్లీషు సీరియల్
Lightening Warrior
మెరుపు వీరుడు
2 ఆటలు

శ్రీ లీలామహల్

2 రోజులు మాత్రం
Tyrone Power నటించిన
Diplomatic Courier
భయంకర రహస్య దొంగలు
రోజూ 3 ఆటలు

శ్రీ లక్ష్మీ టాకీస్

బ్రతుకు తెరువు
నాగేశ్వరరావు, సావిత్రి, రంగారావు
5 వ వారం 2 ఆటలు

శ్రీ మారుతి సినిమా

ఆలీబాబా 40 దొంగలు
మహీపాల్, షకీలా
3 ఆటలు

శేష్ మహల్

SHART షర్త్
శ్యామ, దీపక్, శశికళ
2 ఆటలు

శ్రీ దుర్గాకళామందిరం

పాతాళభైరవి
రామారావు, మాలతి, రేలంగి
2 ఆటలు

శ్రీ ఈశ్వర మహల్

సనమ్ (హిందీ)
సురయ్య, దేవానంద్, గోప్
2 ఆటలు

గుంటూరు సినిమాలు

శ్రీ లక్ష్మీ పిక్చర్ ప్యాలెస్

శోభ (హిందీ)
ఉషాకిరణ్, అభిభట్టాచార్య
2 ఆటలు

ప్రభాకర్ టాకీస్

Captain Marvel
2 ఆటలు

సంపాదకుడు, ముద్రాపకుడు, ప్రచురణకర్త — కాట్రగడ్డ రాజగోపాలరావు — [illegible], విజయవాడ. సంపాదకవర్గం: — మోటూరు హనుమంతరావు, (అధ్యక్షుడు) [illegible], కాట్రగడ్డ రాజగోపాలరావు.